అన్నదాత సుఖీభవ రేపు

- రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్రం రూ.2 వేలు
- రైతుల ఖాతాల్లో జమ కానున్న డబ్బులు

అనకాపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులు ఈ నెల 19వ తేదీన విడుదల చేయా లని నిర్ణయించింది. అర్హులైన ప్రతి రైతు ఖాతాకు రూ.ఐదు వేల వంతున జమ చేయనున్నది. అదే సమయంలో కేంద్రం 'పీఎం కిసాన్' ... మిగతా 8వ పేజీలో

బెన్నవోలులో తెల్లసుద్ద మైనింగ్

వైట్ క్లే తవ్వకాలకు ప్రైవేటు కంపెనీ దరఖాస్తు

- గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ
- సమస్యలు తలెత్తుతాయని స్థానికుల ఆందోళన
- వచ్చే ఏడాది నుంచి వైట్ క్లే తవ్వకాలు ప్రారంభం?
- జీవనోపాధి కోల్పోతామని పలువురి ఆవేదన



తెల్లసుద్ద నిక్షేపాలు వున్న బెన్నవోలు కొండ

చోడవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెన్నవోలు కొండపై సుదీర్ఘ విరామం తరువాత తెల్లసుద్ద క్వారీలో తవ్వకాలకు రంగం సిద్ధం అవుతున్నది. సిరామిక్ టైల్స్ తయారీలో ఉపయోగించే తెల్లసుద్ద (వైట్ క్లే) నిక్షేపాలు బెన్నవోలు గ్రామానికి ఆనుకుని ఉన్న కొండల్లో పుష్కలంగా ఉన్నాయి. గతంలో యానాంలో వున్న రీజెన్సీ సిరామిక్ పరిశ్రకు ఇక్కడి నుంచి వైట్ క్లేను తరలించారు. రీజెన్సీ ఇండస్ట్రీకి 2013 వరకు లీజు ఉండేది. అయితే కార్మికుల ఆందోళనల కారణంగా రీజెన్సీ సిరామిక్ పరిశ్రమ 2008లో మూత పడడంతో బెన్నవోలు కొండల్లో తెల్లసుద్ద తవ్వకాలు నిలిచిపోయాయి. మళ్లీ ఇప్పుడు వైట్ క్లే తవ్వకాలకు 'శ్రీలక్ష్మీ నరసింహ మెటల్స్ అండ్ శాండ్ ఇండస్ట్రీ' దరఖాస్తు చేసుకోగా, కాలుష్య నియంత్రణ అనుమతుల కోసం ఈ నెల 15న బెన్నవోలులో ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించారు. బెన్నవోలును ఆనుకుని ఉన్న 41.99 ఎకరాల్లో తెల్లసుద్దను తవ్వకునేందుకు ఈ సంస్థకు అనుమతులు ఇవ్వనున్నారు. ఏడాదికి 3.6 లక్షల టన్నుల వైట్ క్లేను తవ్వి తరలించేందుకు ప్రభుత్వం అనుమతిస్తున్నది. టన్నుకు రూ.130 చొప్పున ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాల్సి వుంటుంది. నెలకు 30 వేల టన్నుల చొప్పున వైట్ క్లేను తవ్వుతారు. దీనిని 150 భారీ వాహనాల్లో రవాణా చేస్తారు. దీనివల్ల నీటి వనరులకు, పంట పొలాలకు ముప్పు వాటిల్లుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాభిప్రాయ సేకరణలో భిన్నస్వరాలు

బెన్నవోలు కొండపై వైట్ క్లే తవ్వకాల కోసం నిర్వహించిన ... మిగతా 8వ పేజీలో



బెన్నవోలు కొండపై తెల్లసుద్ద గనులు

ఉపాధిని దెబ్బతీయవద్దు

\- రంగాల దేవుళ్లు, రంగాల త్రినాథ్, బెన్నవోలు





తెల్లసుద్ద కొండను నమ్ముకుని ఎంతో కాలంగా జీవిస్తున్నాం. ఇక్కడ సుద్దను తవ్వకుని, ఊరూరా తిరుగుతూ అమ్ముకుంటున్నాం. సంక్రాంతి పండుల సమయంలో ఆదాయం బాగుంటుంది. లీజుకు తీసుకున్న సంస్థ యంత్రాలతో తవ్వకాలు నిర్వహిస్తే ఉపాధి కోల్పోతాం. ప్రభుత్వమే మాకు న్యాయం చేయాలి.



మహిళలను ఢీకొన్న తరువాత రోడ్డుపక్కకు దూసుకుపోయిన కారు

కారు బీభత్సం

- హైవే పక్కన ఉన్న ఇద్దరు మహిళలపైకి దూసుకెళ్లిన వాహనం
- ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు

కొత్తూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణ పరిధిలోని గవరపాలెం శివారున జాతీయ రహదారిపై కారు బీభీత్సం సృష్టించింది. ఇండియన్ ఆయిల్ బంకు కూడలిలో రోడ్డు పక్కన నిల్చున వారిపైకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఒక మహిళ అక్కడికక్కడే మృతిచెందగా, మరో మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటనకు సంబంధించి ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణ తెలిపిన వివరాలిలా వున్నాయి.

అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం ప్రాంతానికి చెందిన మళ్ల లీలా వరహా వెంకటలక్ష్మి మునగపాక మండల ఏపీఓగా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం జాతీయ రహదారి పక్కనున్న పెట్రోలు బంకు వద్ద రోడ్డు దాటేందుకు ఆగారు. ఈమె పక్కనే మునగపాక మండలం నారాయుడుపాలెం గ్రామానికి చెందిన కైతా పైడమ్మ (42) పొలంలో కూలి పనికి వెళ్లేందుకు రోడ్డు దాటడానికి నిల్చుని వున్నారు. ఈ సమయంలో తుని వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న కారు రోడ్డుపక్కకు వచ్చి, ద్విచక్రవాహనాన్ని ఢీకొని, పక్కనే వున్న పైడమ్మపైకి దూసుకుపోయింది. వెంకటలక్ష్మి పక్కకు తుళ్లిపోయి కిందపడిపోగా, పైడమ్మ తల విద్యుత్ స్తంభానికి బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. కారులో ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో లోపల వున్న వారు సురక్షితంగా బయటపడ్డారు. కారు డ్రైవర్ అజాగ్రత్త వల్లనే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, పైడమ్మ మృతదేహాన్ని ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. తీవ్రంగా గాయపడిన వెంకటలక్ష్మి అనకాపల్లిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

ఖాళీ జాగా... వేసెయ్ పాగా!

ఎన్‌హెచ్ఏఐ స్థలాలు దర్జాగా ఆక్రమణ

- తొలుత పాకలు, రేకుల షెడ్ల నిర్మాణం
- కొంతకాలం తరువాత పక్కా నిర్మాణాలు
- పట్టించుకోని హైవే అధికారులు



రేబాక పంచాయతీ కాపుశెట్టివానిపాలెంలో జాతీయ రహదారి పక్కన అక్రమ నిర్మాణం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ)కి చెందిన ఖాళీ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. రహదారి పక్కన సెంటు స్థలం రూ.లక్షలు పలుకుతుండడంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. ఖాళీ జాగా కనిపిస్తే చాలు.. దుకాణాలు, షెడ్లు నిర్మించి కబ్జాకు పాల్పడుతున్నారు. జాతీయ రహదారి అభివృద్ధి, విస్తరణ సమయంలో భూములు, స్థలాలు కోల్పోయి, పరిహారం పొందిన వారిలో కొంతమంది అవే స్థలాలన ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడుతున్నారు. తొలుత తాత్కాలికంగా పాకలు, రేకుల షెడ్లు వేసి, కొంతకాలం తరువాత శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారు.

అనకాపల్లి నుంచి సబ్బవరం వెళ్లే జాతీయ రహదారి పక్కన రేబాక పంచాయతీ కాపుశెట్టివానిపాలెంలో సర్వే నంబర్లు 10-2, 41-3లోని భూములు ఆక్రమణకు గురయ్యాయి. రేబాక, కాపుశెట్టివానిపాలెం, పొడుపులమ్మ తల్లి ఆలయం ప్రాంతాల్లో గతంలో హైవే కోసం భూములు కోల్పోయిన వారు ఎన్‌హెచ్ఏఐ నుంచి పరిహారం పొందారు. రహదారి నిర్మాణానికి వినియోగించగా పక్కన కొంత స్థలం మిగిలింది. గతంలో ఎవరైతే పరిహారంపొందారో.. వారే ఇప్పుడు ఆయా స్థలాలను ఆక్రమించేస్తున్నారు. రహదారిని ఆనుకొని పక్కా నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ ఎన్‌హెచ్ఏఐ అధికారులు పట్టించుకోవడంలేదు. పైగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న ప్రదేశంలో హైటెన్షన్ విద్యుత్ లైన్‌లు, భూగర్భ పైపులైన్‌లు వున్నాయి. ఆక్రమణదారులు అవేమీ పట్టించుకోవడం లేదు.

జాతీయ రహదారి పక్కన అనకాపల్లి వద్ద డబుల్ ట్రంపెట్ అండర్ బ్రిడ్జిని ఆనుకొని ఒక ప్లైవుడ్ ... మిగతా 8వ పేజీలో



అనకాపల్లి డబుల్ ట్రంపెట్ అండర్ బ్రిడ్జి సమీపంలో నిర్మించిన ప్లైవుడ్ కంపెనీ షెడ్డు

వాకరోడ్డు నిర్మాణానికి బ్రేకులు

- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన అటవీ శాఖ అధికారులు



వాకరోడ్డు మధ్యలో అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

మాకవరపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల నుంచి పెండింగ్‌లో వున్న వాకరోడ్డు నిర్మాణం కల నేరవేరబోతున్న సమయంలో అటవీ శాఖ అధికారులు అడ్డుకట్టు వేశారు. మండలంలోని ఎరకన్నపాలెం నుంచి ఎలమంచిలి మునిసిపాలిటీ పరిధిలోని పెదపల్లి వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టగా.. సోమవారం అటవీ శాఖ సిబ్బంది రోడ్డు మధ్యలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ భూమి వ్యవహారం కోర్టు పరిధిలో వున్నందున రహదారి నిర్మాణం, ఈ మార్గంలో రాకపోకలను నిషేధిస్తున్నట్టు బోర్డులో పేర్కొన్నారు. నర్సీపట్నం, మాకవరపాలెం నుంచి ఎలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాలకు తాళ్లపాలెం మీదుగా వెళ్లాలి. మాకవరపాలెంలోని ఎరకన్నపాలెం నుంచి ఎలమంచిలి పట్టణ పరిధిలోని పెదపల్లి వరకు వాకరోడ్డు (రెవెన్యూ/ అటవీ భూముల్లో కాలిబాట) వుండేది. దీనిని విస్తరించి, అభివృద్ధి చేస్తే.. ఎలమంచిలి వైపు వెళ్లడానికి సుమారు 12 కిలోమీటర్ల మేరదూరం తగ్గుతుంది. అంతేకాక మండలంలో ఏర్పాటు కానున్న ఎంఎస్ఎంఈ పార్కులో స్థాపించే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ముడిసరుకు రవాణా, తయారైన ఉత్పత్తులు ఎగుమతికి ఈ రోడ్డు ఎంతో ఉపయోగపడుతుంది. దీంతో ఐదు నెలల కిందట వాకరోడ్డు నిర్మాణం ప్రారంభించారు. ఇంతవరకు ఎరకన్నపాలెం వైపు నుంచి సుమారు మూడు కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. ఇటీవల మండల పర్యటనకు వచ్చిన పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, కలెక్టర్ విజయకృష్ణన్, ఆర్డీవోలు.. వాకరోడ్డు నిర్మాణాన్ని త్వరలో పూర్తిచేస్తామని చెప్పారు. అయితే అనూహ్యంగా వాకరోడ్డు మధ్యలో పెదపల్లి ఫారెస్ట్ అధికారులు హెచ్చరిక బోర్డు పెట్టి, రోడ్డుకు అడ్డంగా గోతులు తవ్వారు. మరోవైపు ఎరకన్నపాలెం వద్ద పందూరు రేంజ్ అటవీ అధికారులు హెచ్చరిక బోర్డు పెట్టారు. రోడ్డు నిర్మిస్తున్న భూమి అటవీ శాఖ పరిధిలో ఉందని, అలాగే ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకూడదని, వాహనాలు సైతం రాకపోకలు సాగించకూడదని పేర్కొన్నారు.

త్రిశంకుస్వర్గంలో సీతపాలెం!

ఎస్ఈజడ్ కోసం భూములు ఇచ్చిన రైతులు

- రెండు దశాబ్దాలు అయినా పునరావాసం కల్పించని ప్రభుత్వం
- గ్రామాన్ని తరలించకుండానే పరిశ్రమల ఏర్పాటు
- ఫార్మా కంపెనీల కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి
- రావిపాలెంలో ఇళ్ల స్థలాలు ఇస్తామంటున్న అధికారులు
- దిబ్బపాలెం లేదా పంచదార్లలో కావాలంటున్న నిర్వాసితులు
- ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.25 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్

రాంబిల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):



సీతపాలెం గ్రామం

ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజడ్) కోసం జీవనాధారమైన పంట భూములను ఇచ్చేశారు. చివరకు ఉన్న ఊరును కూడా త్యాగం చేయడానికి సిద్ధపడ్డారు. ఇది జరిగి సుమారు రెండు దశాబ్దాలు కావస్తున్నది. కానీ నాడు అధికారులు, పాలకులు ఇచ్చిన హామీలను ఇంతవరకు అమలు చేయలేదు. గ్రామానికి సమీపంలో ఏర్పాటైన పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద తమకు అనువైన చోట పునరావాస కాలనీ నిర్మించాలని కోరుతున్నా, అధికారులు పట్టించుకోవడంలేదు.

అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటైన ప్రత్యేక ఆర్థిక మండలి కోసం పలు గ్రామాల మాదిరిగానే రాంబిల్లి మండలం లాలంకోడూరు పంచాయతీ పరిధిలోని సీతపాలెంలో కూడా ఏపీఐఐసీ అధికారులు 230 ఎకరాలు సేకరించారు. అప్పట్లో నష్టపరిహారం కింద ఎకరాకు రూ.5.5 లక్షలు ఇచ్చారు. త్వరలో గ్రామాన్ని కూడా ఖాళీ చేయాలని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీని అమలు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఎస్ఈజడ్ కోసం ముందుగా గ్రామాలను ఖాళీ చేయాల్సిన వారికి దిబ్బపాలెం వద్ద పునరావాస కాలనీలో స్థలాలు కేటాయించి, ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించారు. సీతపాలెం నిర్వాసితులకు కూడా దిబ్బపాలెం లేదంటే పంచదార్లలో ఆర్అండ్ఆర్ కాలనీ ఏర్పాటు చేసి, ఇళ్ల స్థలాలు ఇస్తామని, అందరికీ ఒకేచోట పునరావాసం కల్పిస్తామని అప్పట్లో అధికారులు హామీ ఇచ్చారు. కానీ కొంతకాలం తరువాత దిబ్బపాలెం/పంచదార్ల కాకుండా అచ్యుతాపురం మండలంలోని రావిపాలెంలో ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పారు. అయితే రావిపాలెంలో అధికారులు ప్రతిపాదించిన ప్రదేశం నివాస యోగ్యంకాదని, తమకు దిబ్బపాలెం ఎస్ఈజడ్ కాలనీలో, లేదంటే పంచదార్లలో ఇవ్వాలని సీతపాలెం నిర్వాసితులు కోరారు. కానీ అధికారులు ఇంతవరకు పట్టించుకోలేదు. మరోవైపు ఎస్ఈజడ్ కోసం సేకరించిన భూముల్లో కాలక్రమేణా పరిశ్రమలు, కంపెనీలు ఏర్పాటయ్యాయి. ఫార్మా కంపెనీల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో సీతపాలెం గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. నిర్వాసిత గ్రామం కావడంతో అధికారులు ఇక్కడ ఎటువంటి అభివృద్ధి పనులు చేయడంలేదు. రహదారులు అధ్వానంగా వున్నాయి. తాము కోరినచోట ఆర్అండ్ఆర్ కాలనీ ఏర్పాటు చేసి స్థలాలు ఇవ్వాలని, లేదంటే ... మిగతా 8వ పేజీలో

ఈపీడీసీఎల్‌లో అడ్డగోలు బదిలీలు

- అనకాపల్లి సర్కిల్‌లో అధికారుల ఇష్టారాజ్యం
- అడ్మిన్ గ్రౌండ్స్ పేరుతో ఎక్కడికి కావాలంటే అక్కడికే...
- 40 రోజుల క్రితం ముగ్గురు మహిళలకు, తాజాగా మరో నలుగురికి...
- కార్పొరేట్ కార్యాలయానికి సమాచారం నిల్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్)లో బదిలీలకు ఓ సమయం అంటూ లేకుండా పోయింది. అంతా అధికారుల ఇష్టారాజ్యంగా మారింది. ప్రతి శాఖలో ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోనే బదిలీల ప్రక్రియ చేపడతారు. ఆ తరువాత అత్యవసరం అనుకుంటే ఉన్నతాధికారులతో చర్చించి ఒకటి, రెండు చేస్తారు. కానీ ఈపీడీసీఎల్ అనకాపల్లి సర్కిల్‌లో గత కొద్దికాలంగా ఎప్పుడు పడితే అప్పుడు బదిలీలు చేస్తున్నారు. సాధారణంగా సిబ్బంది పనితీరు బాగుండకపోయినా, అక్కడ ఇబ్బందులు ఎదురవుతున్నా ఆ విషయాన్ని ఆ ప్రాంత అధికారులు ...జిల్లా బాధ్యుల దృష్టికి తీసుకువెళతారు. వినియోగదారుల సౌకర్యార్థం అవసరమైతే వారిని మార్చాలని లేఖ రాస్తారు. వాటిపై చర్చించి నిర్ణయం తీసుకోవడం ఆనవాయితీ. కానీ ఇటీవల అనకాపల్లి ... మిగతా 8వ పేజీలో

ఆర్డీవో కార్యాలయానికి సొంతగూడు

- 90 శాతానికిపైగా పనులు పూర్తి
- ఈ నెలాఖరులోగా ప్రారంభం?



ఆర్డీవో కార్యాలయం నూతన భవనం

కొత్తూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు జిల్లా పరిషత్ అతిథిగృహంలో కొనసాగుతున్న ఆర్డీవో కార్యాలయానికి ఎట్టకేలకు సొంతగూడు ఒనగూరనున్నది. భవన నిర్మాణ పనులు తుది దశకుచేరగా, ఈ నెలాఖరులోగా ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అనకాపల్లి కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ సుమారు పుష్కరకాలం క్రితం ఏర్పాటైంది. అప్పట్లో ఇక్కడ ప్రభుత్వ భవనం అందుబాటులో లేకపోవడంతో ఉడ్‌పేటలోని జిల్లా పరిషత్ అతిథిగృహంలో ఆర్డీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో అనకాపల్లి మండలం కొత్తూరు మేజర్ పంచాయతీ శారదా నగర్‌లో వున్న డంపింగ్ యార్డును ఖాళీ చేయించి, అక్కడ ఆర్డీవో కార్యాలయం నూతన భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కానీ వివిధ కారణాల వల్ల పనులు ముందుకు సాగలేదు. మరోవైపు జిల్లా పరిషత్ అతిథిగృహంలో ఆర్డీవో కార్యాలయం నిర్వహణ కష్టంగా మారింది. ఈ సమస్య ప్రభుత్వం దృష్టికి రావడంతో నిధులు మంజూరు చేసింది. మీటింగ్ హాలు, ఆర్డీవో ఛాంబర్, ఏవో ఛాంబర్, పరిపాలనా విభాగాల కోసం 12 గదులు నిర్మించారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయి. పెయింటింగ్ పనులు రెండు రోజుల్లో పూర్తి చేసి ఈ నెలాఖరులోగా ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

డ్వాక్రాల సొమ్ము రూ.50 లక్షలు స్వాహా

- వెలుగు సిబ్బంది, బ్యాంకు అధికారులు కుమ్మక్కు
- ఏపీఎం కార్యాలయం ఎదుట మహిళల ఆందోళన



వెలుగు ఏపీఎం కార్యాలయం ఎదుట నిరసన తెలియచేస్తున్న డ్వాక్రా సభ్యులు

మాడుగుల, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): తమకు తెలియకుండా బ్యాంకు నుంచి రుణాలు తీసుకుని, ఇప్పుడు రుణవాయిదాలు చెల్లించాలని నోటీసులు జారీచేయడం ఏమిటంటూ డ్వాక్రా మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ, మాడుగుల పంచాయతీ పరిధిలో 14 డ్వాక్రా సంఘాలకు గతంలో సుమారు రూ.50 లక్షల మేర రుణాలు మంజూరయ్యాయని చెప్పారు. అయితే వెలుగు సిబ్బంది ఈ విషయాన్ని సభ్యులకు చెప్పకుండా సంతకాలు, బయోమెట్రిక్ తీసుకుని, డబ్బులు డ్రాచేశారని తెలిపారు. డబ్బులను డ్వాక్రా సభ్యులకు ఇవ్వకుండా వెలుగు సిబ్బంది సొంతానికి వాడేసుకున్నారని ఆరోపించారు. అయితే రుణ వాయిదాలు చెల్లించాలంటూ కొద్ది రోజులుగా బ్యాంకు నుంచి డిమాండ్ నోటీసులు వస్తుండడంతో విస్తుపోయినట్టు చెప్పారు. తాము బ్యాంకుకు రాకుండానే రుణాలు ఎలా మంజూరు చేశారని బ్యాంకు అధికారులను ప్రశ్నించారు. డ్వాక్రా సంఘాల పేరుతో రుణాలు తీసుకున్న వైనంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. అదే విధంగా వెలుగు సిబ్బంది, బ్యాంకు అధికారులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. కాగా డ్వాక్రా సభ్యులకు తెలియకుండా వారి పేర్లతో రుణాలు మంజూరు కావడంపై వెలుగు ఏపీఎం రమణకుమారిని వివరణ కోరగా.. డ్వాక్రా మహిళలు చేస్తున్న ఆరోపణలు వాస్తవమేనని, ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.

పెదగుమ్ములూరులో చెత్త సేకరణ పరిశీలన



పెదగుమ్ములూరులో ఇంటింటా చెత్త సేకరణను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ

ఎస్.రాయవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగుమ్ములూరు, తిమ్మాపురం, ధర్మవరం అగ్రహారం గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు చేపడుతున్న ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని సోమవారం డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ క్లాప్ మిత్రులు ఇంటింటికి వెళ్లి తడి చెత్త, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి చర్యలు'

అచ్యుతాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని నునపర్తి ఎంపీటీసీ సభ్యుడు పల్లి వెంకటరావు తెలిపారు. సోమవారం దొప్పెర్ల బీసీ కాలనీలో ఆయన ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెన్షన్, రేషన్ కార్డులు, భూసమస్యలు, మురుగు కాలువల గురించి గ్రామస్థులు తెలిపారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రండి బాబూరావు, కొల్లి వరహాలరావు, ముచ్చు గంగరాజు, కొల్లి వెంకటలక్ష్మి, చిట్టిబాబు, పల్లి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పురవీధుల్లో సాంబమూర్తి దేవుడు ఊరేగింపు

మునగపాక, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మునగపాకలో శతాబ్దాలు చరిత్ర కలిగిన సాంబమూర్తి దేవుడును సోమవారం పురవీధుల్లో ఊరేగించారు. రంగు రంగులు నూలు దారాలు, వస్త్రాలతో తయారు చేసిన గుమ్మటంలో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

కన్నులపండువగా శివ, పార్వతిల కల్యాణం



పాటిపల్లిలో వేడుకగా శివ, పార్వతిల కల్యాణం

మునగపాక, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో పాటిపల్లి గ్రామంలో శ్రీరామలింగేశ్వరస్వామి వార్షిక కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఏటా కార్తీకమాసం ఆఖరి సోమవారం వార్షిక కల్యాణం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా సోమవారం శివ, పార్వతి ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహించారు.

విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు

రాంబిల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా దిమిలి శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు పాటలు, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారిణి శకుంతల మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా సంపూర్ణ విజ్ఞానాన్ని సంపాదించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

29న ఏపీకి నాఫ్ సెంట్రల్ కమిటీ సభ్యులు



నియామక పత్రాలు అందజేస్తున్న నాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు

పాయకరావుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు జాతీయ మత్స్యకార సంఘం సెంట్రల్ కమిటీ సభ్యులు ఈనెల 29వ తేదీన రాష్ట్రానికి వస్తున్నారని నాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. నక్కపల్లి మండలంలో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసన దీక్షలు చేస్తున్న రాజయ్యపేట మత్స్యకారులను కలిసి, వారి సమస్యలు తెలుసుకునేందుకు సెంట్రల్ కమిటీ ఈనెల 21వ తేదీన రాష్ట్రానికి వస్తున్నట్టు ముందుగా ప్రకటించిన విషయం తెలిసిందేనన్నారు. అయితే సమయం దగ్గర పడుతుండడంతో అన్ని జిల్లాల నుంచి నాయకులు రావాల్సి ఉన్నందున ఈనెల 29వ తేదీకి వాయిదా వేయడం జరిగిందన్నారు. అనంతరం రాష్ట్ర సంఘంలో నూతనంగా నియమితులైన ఇద్దరికి నియామక పత్రాలు అందజేశామని ఆయన తెలిపారు.

ఆడపిల్ల నాటిక విజేత కొత్తపేట విద్యార్థినులు



కొత్తపేట ఉన్నత పాఠశాల బృందానికి బహుమతి అందజేస్తున్న జి. బుజ్జి

ఎలమంచిలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తేటగుంట తిమ్మాపురంలో సంకల్ప సేవా సంస్థ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎలమంచిలి కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన ఆడపిల్ల నాటిక ప్రథమ బహుమతి పొందింది. సోమవారం స్కూలు ఆవరణలో హెచ్ఎం వైవీ రమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో సంస్థ ప్రతినిధి గొలుసుపూడి బుజ్జి చేతులు మీదుగా బహుమతి అందుకున్నారు. విద్యార్థినులకు తర్ఫీదునిచ్చిన క్రాఫ్ట్ ఉపాధ్యాయిని అపర్ణను అందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టైప్ 4 కేజీబీవీలో చేరేందుకు దరఖాస్తుల స్వీకరణ

ఎస్.రాయవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):మండలంలోని దార్లపూడి జడ్పీ ఉన్నత పాఠశాలకు అనుబంధంగా ఉన్న టైప్ 4 కేజీబీవీలో చేరికకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు ప్రధానోపాధ్యాయుడు టేకు జాన్ మెతుషెల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సమగ్ర శిక్ష కో-ఆర్డినేటర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో 9వ తరగతి నుంచి 12వ తరగతి చదువుతున్న వంద మంది బాలికలకు ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పించడం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. బాలికలకు చదువుతో పాటు ఉచిత భోజనం, వసతి ఉంటుందని, బయట ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బాలికలకు మాత్రం భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు.

కిటకిటలాడిన శైవక్షేత్రాలు

ఎలమంచిలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆఖరి సోమవారం కావడంతో పట్టణంలోని శైవక్షేత్రాలన్నీ భక్తుల శివ నామస్మరణతో మార్మోగాయి. కొత్తపేట రామలింగేశ్వర స్వామి, సీతారాములు, త్రిమూర్తులు స్వామి ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయాలకు చేరుకుని అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మండలంలోని ఏటికొప్పాక, పులపర్తి, పిఎస్‌ఆర్‌పేట, లక్కవరం, లైనుకొత్తూరు తదితర గ్రామాల్లోని ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

మునగపాకలో..

మండలంలో కార్తీకమాసం ఆఖరి సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివ లింగం, శివ, పార్వతిలను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. శివాలయాల వద్ద దీపారాధనలు చేశారు. మండలంలో మునగపాక, వాడ్రాపల్లి, టి.సిరసపల్లి, వెంకటాపురం, గవర్ల అనకాపల్లి తదితర గ్రామాల్లో కార్తీకమాసం వేడుకలు ఘనంగా జరిగాయి.

నక్కపల్లిలో..

మండలంలోని రేబాక గూడుపమ్మ ఆలయంలో కార్తీకమాసం నాలుగో సోమవారం సందర్భంగా సామూహిక కుంకుమ పూజలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏలూరు శ్రీకృష్ణ చరణానంద భారతీ స్వామి హాజరై అనుగ్రహ భాషణం చేశారు. ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరిరాజు, గ్రామ పెద్దలు, యువకుల విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఆర్‌ఎస్‌ఎస్ ఉత్తరాంధ్ర అర్చక పురోహిత విభాగ్ ప్రముఖ్ బంకుపల్లి సత్యనారాయణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఉపమాక శివాలయంలో భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా నక్కపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు.



ఎస్.రాయవరం: గెడ్డపాలెం చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



నక్కపల్లి: రేబాకలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

ఎస్.రాయవరంలో..

కార్తీకమాసం చివరి సోమవారం మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి పెద్దఎత్తున భక్తులు శివాలయాలకు వెళ్లి శివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గెడ్డపాలెం చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి లక్ష బిల్వార్చన చేశారు. మధ్యాహ్నం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అలాగే సర్వసిద్ధి, ఎస్. రాయవరం, పెదఉప్పలం, పెనుగొల్లు, పెదగుమ్ములూరు తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

పాయకరావుపేట రూరల్‌లో..

కార్తీక మాసం నాలుగో సోమవారం మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. తెలవారుజాము నుంచే సత్యవరం, నామవరం, గోపాలపట్నం సీతమ్మవారి కొండ, పెద్దిపాలెం, పెంటకోట, రాజగోపాలపురం, గోపాలపట్నం అల్లువారి పొలంలోని శివాలయాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తుల శివ నామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. గోపాలపట్నం సీతమ్మవారి కొండకు వేలాది భక్తులు తరలి వచ్చి ఉమాధర్మలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. గోపాలపట్నం గ్రామస్థుల ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన చేశారు.



ఎలమంచిలి త్రిమూర్తులు స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



గోపాలపట్నం ఉమాధర్మలింగేశ్వర స్వామిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు



మునగపాకలో శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా టీడీపీ కమిటీల ప్రమాణ స్వీకారం



ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాల అలంకరిస్తున్న దృశ్యం



ప్రమాణ స్వీకారం చేస్తున్న వివిధ కమిటీల నాయకులు

అచ్యుతాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి నియోజకవర్గ టీడీపీ శ్రేణుల వనభోజన కార్యక్రమం అచ్యుతాపురంలో సోమవారం ఘనంగా జరిగింది. తొలుత దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.. ఈ సందర్భంగా నియోజకవర్గంలో మండల, క్లస్టర్, యూనిట్, బూత్, గ్రామ కమిటీల ప్రమాణ స్వీకారాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, ఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ పరిశీలకుడు బొండా జగన్నాథం, జెడ్‌పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ, రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి శివఅప్పారావు, టీడీపీ మండల అధ్యక్షుడు పీలా తులసీరామ్, టీడీపీ నేతలు లాలం భరత్, పెంటకోట విజయ్, గొర్లె శివన్నారాయణ మూర్తి, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, భీమరశెట్టి శ్రీనివాసరావు, తెలుగు మహిళా జిల్లాఅధ్యక్షురాలు ఆడారి మంజు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ శ్రీధర్‌రెడ్డి



పాయకరావుపేట జడ్పీ బాలికోన్నత పాఠశాలలో తరగతి గదిని పరిశీలిస్తున్న జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ శ్రీధర్‌రెడ్డి

పాయకరావుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మార్చిలో జరిగే టెన్త్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలను సాధించాలని జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం పాయకరావుపేటలో టెన్త్ పరీక్షా కేంద్రాలైన ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికోన్నత పాఠశాల, శ్రీచైతన్య టెక్నో స్కూల్, శ్రీప్రకాష్ విద్యానికేతన్, కనోసా స్కూల్‌తో పాటు మండలంలోని ఎస్.నర్సాపురం, పాల్తేరు జడ్పీ ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా టెన్త్ పరీక్షా కేంద్రాలకు ఏమైనా నష్టం వాటిల్లినదా అన్నది పరిశీలించామన్నారు. టెన్త్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించామన్నారు. ఆయన వెంట ఎంఈఓలు కేఎన్.గాంధీ, రమేశ్‌బాబు తదితరులున్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి అంబలం పూజ



అయ్యప్పస్వామి విగ్రహాలను సన్నిదానానికి తీసుకువెళ్తున్న ఎమ్మెల్యే సోదరులు

అచ్యుతాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అచ్యుతాపురంలో సోమవారం ఏర్పాటుచేసిన అయ్యప్ప స్వామి అంబలం పూజ ఘనంగా జరిగింది. రామన్నపాలెం వద్ద ఎకరా స్థలంలో అయ్యప్పస్వామి సన్నిదానం ఏర్పాటు చేశారు. రాత్రి ఏడు గంటలకు స్వగృహం నుంచి గుర్రాల రథంపై సన్నిదానం వరకు అయ్యప్పస్వామి విగ్రహాలను తీసుకువచ్చారు. అక్కడ నుంచి పండితుల వేదమంత్రాలు, కేరళ వాద్యాలతో విజయకుమార్ సోదరులు అయ్యప్ప స్వామి విగ్రహాలను సన్నిదానానికి తీసువచ్చారు. ఈ సందర్భంగా కన్నెమూల గణపతి, శివుడు, సుబ్రహ్మణ్యస్వామి, లక్ష్మీదేవి, అయ్యప్పస్వామిలకు పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామి పడిమెట్ల పూజ, అభిషేకం చేశారు. స్వాముల శరణ ఘోషతో పాటు పేటతుళ్లి నృత్యం చేశారు. ఈకార్యక్రమంలో భారీ స్థాయిలో అయ్యప్ప, శివ, భవానీ మాలదారులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్ర పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి : ఎంఈవో



శ్రీచైతన్య విద్యార్థులకు నాసా ప్రాజెక్ట్ కిట్లు పంపిణీ చేసిన దృశ్యం

పాయకరావుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్ర పరిజ్ఞానంపై అవగాహన పెంచుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎంఈఓ కేఎన్.గాంధీ అన్నారు. సోమవారం స్థానిక శ్రీచైతన్య టెక్నో స్కూల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పలువురు విద్యార్థులకు నాసా ప్రాజెక్ట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల ఏజీఎం సురేష్, ఆర్ఐ గోపినాథ్, ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, అకడమిక్ కో-ఆర్డినేటర్ పట్నాయక్, సీ బ్యాచ్ ఇన్‌చార్జి లక్ష్మీకాంతం, వైస్ ప్రిన్సిపాల్ మణి, డీన్ మనీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డీపీఎంవో

కోటవురట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైలాసపట్నం ఆయుష్ ఆరోగ్య కేంద్రాన్ని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్ (డీపీఎంవో) డాక్టర్ ప్రశాంతి సందర్శించారు.ఈ సందర్భంగా హెల్త్ సెంటరులో రికార్డులను పరిశీలించారు. గర్భిణులు ఎంతమంది ఉన్నారు? వారిలో ఎంతమందికి కాన్పులు జరిగాయి.. వంటి వివరాలను సేకరించారు. గ్రామంలో కుష్టు వ్యాధి సర్వే జరిగిందా? లేదా.. ఆరా తీశారు. గ్రామంలోని రెండు పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు రక్తహీనత తనిఖీలు చేశారా.. లేదా.. ఆరోగ్య తనిఖీలు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య తనిఖీలు చేస్తున్నారని వైద్యులు బదులిచ్చారు. కిశోర్ బాలికలకు రక్తహీనత రాకుండా చూడాలని ఆరోగ్య సిబ్బంది డీపీఎంవో డాక్టర్ ప్రశాంతి సూచించారు. ఆమెతో పాటు ఎస్‌వో రామచంద్ర, జనార్దన్, డాక్టర్ సంతోష్, ధనలక్ష్మి, ఎంపీహెచ్‌వో బెన్నయ్య ఉన్నారు.



కైలాసపట్నం ఆరోగ్యకేంద్రంలో డాక్టర్స్, సిబ్బందితో సమీక్షిస్తున్న డీపీఎంవో ప్రశాంతి

'ప్రశాంతి' ప్రాజెక్ట్‌కు జాతీయ స్థాయిలో తృతీయ స్థానం



అవార్డు అందుకుంటున్న దృశ్యం

అచ్యుతాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ భువనేశ్వర్‌లో శనివారం జరిగిన రిప్లో-2025 మినిస్టీరియల్ హెల్త్ ఇన్నోవేషన్ హేకతాన్‌లో ప్రశాంతి పాలిటెక్నిక్‌కి చెందిన స్త్రీతు ప్రాజెక్ట్ తృతీయ స్థానం పొందిందని ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు తెలిపారు. స్త్రీతు ఆవిష్కరణతో కౌమారదశలో ఉన్న బాలికలు, మహిళలకు రుతుక్రమ సమయంలో ఎదురవుతున్న సమస్యలకు మొబైల్ యాప్ ద్వారా పరిష్కారం చూపే విధంగా ప్రాజెక్ట్ రూపకల్పన చేసినట్టు ఆయన తెలిపారు. కంప్యూటర్స్ అధ్యాపకుడు పవన్ కుమార్ నల్లూరి ఆధ్వర్యంలో జరిగిన యాప్ రూపకల్పనకు జాతీయ స్థాయిలో తృతీయ స్థానం దక్కటం పట్ల ప్రశాంతి విద్యాసంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ అభినందనలు తెలిపారు.

మర్రిపాలెంలో అధ్వానంగా సీసీ రోడ్లు

- గ్రామంలోని రోడ్లపై ఆరని బురద
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు
- డ్రైనేజీలు ఏర్పాటుకు వినతి

రాంబిల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాలెం గ్రామంలోని పలు వీధుల్లో గల సీసీరోడ్లు అధ్వానంగా ఉండడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. మైనర్ శారదా నదిని ఆనుకొని ఈ గ్రామం లోతట్టు ప్రాంతంలో ఉంది. ఏళ్ల తరబడి గ్రామంలో డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్లలోని వాడకనీరు రోడ్లపై ప్రవహిస్తున్నది. కొన్ని వీధుల్లో సీసీ రోడ్లపై వర్షం నీరు నెలలు తరబడి నిలిచిపోతోంది. గ్రామంలో అధిక శాతం మంది పాడి పశువుల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. రైతుల పశువులు కట్టుకునేందుకు సరైన సదుపాయాలు లేక రోడ్డుపైనే కడుతుండడంతో సీసీరోడ్లు బురదమయంగా తయారవుతున్నాయి. వేసవిలోకూడా సీసీ రోడ్లపై బురద ఉంటుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల సమయంలో గ్రామంలోని వీధులు చెరువులను తలపించే విధంగా తయారవుతున్నాయని వారంటున్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఇదే సమస్య గ్రామాన్ని పీడిస్తుందని, అయినా ఎవరూ పరిష్కరించడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మర్రిపాలెం గ్రామాన్ని సందర్శించినపుడు రాజకీయ నేతలు, అధికారులు, ప్రజా ప్రతినిధులకు పరిస్థితి తెలియజేసినప్పటికీ ఫలితం లేకపోయిందని వారు వాపోయారు. ఇప్పటికైన నియోజకవర్గం పాలకులు, అధికారులు స్పందించి గ్రామంలో డ్రైనేజీలు ఏర్పాటుచేయడంతో పాటు పారిశుధ్య సమస్య తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని మర్రిపాలెం గ్రామస్థులు కోరుతున్నారు.



మర్రిపాలెంలో బురదమయంగా ఉన్న సీసీ రోడ్డు



సీసీరోడ్లపై పశువులను కట్టిన దృశ్యం

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

నక్కపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నక్కపల్లి సీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ కె.పావని కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం వున్న వారికి ఉచితంగా కళ్లద్దాలను అందజేస్తామని చెప్పారు. పిల్లల్లో అంధత్వాన్ని దూరం చేయడంలో విటమిన్ ఏ కలిగిన ఆహారాన్ని చిన్నతనం నుంచి ఎక్కువగా తినడం అలవాటు చేసుకోవాలని సూచించారు. హైస్కూల్ హెచ్ఎం సత్యకుమార్, ప్రత్యేక బోధనా ఉపాధ్యాయురాలు షేక్ యాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లిలోని కాశీవిశ్వేశ్వర ఆలయంలో స్వామివారికి అర్చకుల అభిషేకాలు

శైవక్షేత్రాల్లో కోలాహలం

అనకాపల్లి టౌన్/కశింకోట/పరవాడ/సబ్బవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం నాల్గో సోమవారం సందర్భంగా అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నాలుగు గంటల నుంచి స్వామికి విశేష పూజలు, అభిషేకాలు ప్రారంభమయ్యాయి. అనకాపల్లిలోని కాశీవిశ్వేశ్వర, సిద్ధి లింగేశ్వర, భోగలింగేశ్వర, ఉమారామలింగేశ్వర, మార్కెట్ వద్ద గల శివాలయాల్లో అర్చకులు పంచామృతాలతో నీలకంఠునికి అభిషేకాలు జరిపారు. ధ్వజస్తంభం వద్ద పెద్ద సంఖ్యలో మహిళలు దీపారాధన చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేపట్టారు. కశింకోట మండలంలోని శివాలయాలు కోలాహలంగా మారాయి. తెల్లవారుజాము నుంచి స్వామి దర్శనానికి భక్తులు క్యూకట్టారు. అలాగే, పరవాడ మండలంలోని శివాలయాలకు కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. తాడిగ్రామంలో గల ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి, నీలబాబు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరవాడలోని మల్లికార్జునస్వామి ఆలయంలో సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, కూటమి నాయ కులు పూజలు జరిపారు. స్వయంభూవరం, లేమర్తి అగ్రహారం, దేశపాత్రునిపాలెం శివాలయాల్లో విశేష పూజలు జరిపారు. అదేవిధంగా సబ్బవరం మండలంలోని శైవక్షేత్రాలు కార్తీక సోమవారం సందర్భంగా ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. లింగాలతిరుడుగు సోమ లింగేశ్వరస్వామిని ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ చైర్మన్



పరవాడ మండలం తాడి గ్రామంలో పూజలందుకున్న నీలకంఠేశ్వరస్వామి

కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ దర్శించుకున్నారు. ఇరువాడలోని భీమలింగేశ్వరస్వామిని ఎమ్మెల్యే రమేశ్‌బాబు సోదరుడు వెంకటేశ్వరరావు, మొగలిపురం విఘ్నేశ్వరాలయంలో వైసీపీ నేత గండి రవికుమార్ దర్శించుకున్నారు. అసకపల్లి కాశీవిశ్వేశ్వరస్వామి, దేవీపురంలోని దక్షవటి, వంగలిలోని స్వయంభూ సోమలింగేశ్వరస్వామి, పైడివాడ స్వయంభూ సందీశ్వరస్వామి, సబ్బవరం, మలునాయుడుపాలెం, గొర్లివానిపాలెంలలోని ఉమారామలింగేశ్వరస్వామి, పెదయాతపాలెం గౌరీపరమేశ్వర్ల ఆలయం, గణపతిపురం మల్లి కార్జున ఆలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి.



సబ్బవరం మండలం లింగాలతిరుడుగు సోమలింగేశ్వరాలయంలో గండి బాబ్జీ తదితరులు

అచ్చెర్ల రోడ్డు ఛిద్రం

- అడుగడుగునా గుంతలమయం.. పలుచోట్ల పైకి తేలిన రాళ్లు
- రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పట్టించుకోక పోవడంతో పలుచోట్ల దారుణం
- ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు వేడుకోలు



రోడ్డులో పలుచోట్ల ఎక్కడికక్కడ ఇదే దుస్థితి



గుంతలు పడి, రాళ్లుతేలి ఉన్న అచ్చెర్ల గ్రామ రహదారి

కశింకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అచ్చెర్ల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. అడుగడుగునా పెద్ద పెద్ద గుంతలు పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2015లో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రధాన మంత్రి సడక్ యోజన పథకం కింద ఈ రోడ్డు నిర్మాణం చేపట్టారు. నాటి నుంచి దీని నిర్వహణను పట్టించుకునేవారు కరువయ్యారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్ల వంక కన్నెత్తి చూసేవారు కరువవ్వడంతో నేడు చాలా చోట్ల ఈ దుస్థితికి చేరుకున్నాయని ఆయా పరిధిలోని గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు గుండా అచ్చెర్ల, కొత్తఅచ్చెర్ల, మోసయ్యపేట, గోకువానిపాలెం, జి.సింగవరం రాజాం జంక్షన్ మీదుగా బుచ్చెయ్యపేటకు చేరుకోవచ్చు. దీంతో ప్రతి రోజూ వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలన్న కనీస ఆలోచన అధికారులకు లేకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు పలుచోట్ల రాళ్లు తేలి ఉంటుండడం మరిన్ని అవస్థలు కారణమవుతోంది. చీకటి పడిందంటే చాలు ఈ రోడ్డులో అంధకారం అలముకుంటోంది.

ఇదిలావుంటే, వర్షాలు కురిస్తే ఈ రోడ్డులో ప్రయాణం ప్రత్యక్ష నరకమేనని అంటున్నారు. వర్షపు నీరు అయా గుంతల్లో చేరుతుండడంతో రోడ్డు ఎక్కడో, గుంత ఎక్కడో తెలుసుకోవడం కష్టంగా మారుతుందని అంటున్నారు. కొన్నిచోట్ల రాళ్లు తేలి ఉంటుండడంతో వాహనాలు అదుపు తప్పిబోల్తా పడుతున్నారు. దీంతో పలువురు గాయపడుతున్నారు. వాహనాలు కూడా పాడవుతున్నాయి ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గంజాయి, మాదక ద్రవ్య రహిత సమాజమే లక్ష్యం

- ప్రజల్లో అవగాహనకు అనకాపల్లి రూరల్ పోలీసులు దృష్టి
- అభ్యుదయ సైకిల్ యాత్రపేరిట గ్రామాల్లో ర్యాలీ



మామిడిపాలెంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్

కొత్తూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, మాదక ద్రవ్య రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అనకాపల్లి రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. అనకాపల్లి మండలం మామిడిపాలెం జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి సోమవారం ఇక్కడ సైకిల్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల గ్రౌండ్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగంతో పలువురు యువకులు పెడదారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో సమాజంలోని అన్ని వర్గాలల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఐదు జిల్లాల్లో అభ్యుదయ సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టారన్నారు. అందులో భాగంగా మామిడిపాలెం గ్రామంలో 25 మంది పోలీసు సిబ్బంది సహకారంతో ర్యాలీని ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని పాయకరావుపేటలో మొదలుకొని అనకాపల్లి రూరల్ పోలీసు స్టేషన్ పరిధి మామిడిపాలెం, దర్జీనగర్, ఆర్‌వీఎస్ నగర్ తదితర గ్రామాల్లో ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. యువత సన్మార్గంలో నడిచి సమాజానికి ఆదర్శంగా నిలవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐలు జి.రవికుమార్, జె.నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు పూడి పరదేశినాయుడు, చెక్కల శ్రీనివాసరావు, ఇన్‌చార్జి హెచ్ఎం బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సైకిల్ యాత్రలో పాల్గొన్న రూరల్ పోలీసులు, విద్యార్థులు

నేడు పలు గ్రామాల్లో ఎమ్మెల్యే 'పంచకర్ల' పర్యటన

పరవాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) :మన పల్లెకు - మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా మంగళవారం ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, వాడచీపురుపల్లి, తిక్కవానిపాలెం పంచాయతీల్లో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పర్యటించనున్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసకాసులు తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగున్నర గంటల వరకు పర్యటన కొనసాగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులతో పాటు కూటమి నాయకులు పాల్గొవాలని ఆయన కోరారు.

'ప్రతిభ ఉంటే పుష్కలంగా అవకాశాలు'

కొత్తూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచి నూతన ఆలోచనలతో ముందడుగు వేస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని విక్టరీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మాజీ బోర్డు సభ్యుడు, ఏఎంఏఎల్ కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ వివేక్ రాజశేఖర్ అన్నారు. ఏఎంఏఎల్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రతిభ ఉంటే అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రం అభివృద్ధిబాట పట్టినందున చక్కని అవకాశాలు వస్తాయని, అందుకు తగిన సామర్థ్యంతో సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు, కరస్పాండెంట్ పెంటకోట వెంకటరామారావు, అనురాధలతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి పూర్వ విద్యార్థుల సాయం



కుటుంబానికి నగదు అందిస్తున్న దృశ్యం

పరవాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వాడచీపురుపల్లి హైస్కూల్ పూర్వ విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. 2005-06 విద్యా సంవత్సరంలో తమతో పాటు పదో తరగతి చదువుకున్న కూండ్రపు నాగేశ్వరరావు అనారోగ్యానికి గురై గత కొంతకాలంలో ఇంటికే పరిమితమయ్యాడు. ఇతని పరిస్థితిని తెలుసుకున్న స్నేహితులంతా కలిసి రూ.58 వేలను సమకూర్చి సోమవారం ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. పూర్వ విద్యార్థులు సమ్మంగి అప్పలరాజు, వియ్యపు అప్పలనాయుడు, చీపురుపల్లి హరిబాబు, పైలా రోహిత్, కోరంగి గణేష్, కూండ్రపు ముత్యాలు, సీహెచ్. నేస్తాలు, ఎస్.నరేష్, ప్రసాద్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శూలాల మహోత్సవం



చౌడేశ్వరి సాంబశివుని ఆలయంలో మూలవిరాట్



ఉపవాస దీక్ష చేసి శూలాలు ధరించిన భక్తుడు

అనకాపల్లి టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చినరాజుపేట చౌడేశ్వరి సాంబశివుని ఆలయం వద్ద సోమవారం రాత్రి శూలాల మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రాత్రి పది గంటల సమయంలో మొక్కుబడుల్లో భాగంగా ఉపవాస దీక్షలు చేసిన భక్తులు వివిధ రకాల శూలాలు ధరించారు. ఉపవాస దీక్షలో ఉన్నవారు సుబ్రహ్మణ్య శూలం, నక్షత్ర శూలం, గంప శూలం, లింగాకార శూలం ధరించి శివతాండవం చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. చినరాజుపేట ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు పురవీధుల గుండా అర్ధరాత్రి దాటే వరకు సాగిన అనంతరం తిరిగి ఆలయానికి చేరుకుంది. అధిక సంఖ్యలో భక్తులు దారిపొడవున ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. ఉత్సవంలో భాగంగా రాత్రికి ఆలయ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రముఖ సినీ దర్శకుడు నక్కిన త్రినాథరావు స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవం సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ అధ్యక్షుడు రెడ్డి వరప్రసాద్, కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఇదిలావుంటే, స్వామివారిని గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, కూటమి నాయకులు వేర్వేరుగా దర్శించుకున్నారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను వీరు ప్రారంభించారు.



ఉత్సవంలో మాట్లాడుతున్న దర్శకుడు నక్కిన త్రినాథరావు

ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలపై వినతి



అధ్యక్షుడు విద్యాసాగరరావుకు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కొత్తూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు సోమవారం అనకాపల్లి వచ్చిన ఆయ నను ప్రభుత్వ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఆర్.సతీష్, ప్రధాన కార్యదర్శి హరికృష్ణ తదితరులు కలిసి మాట్లాడారు. తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారమార్గం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఉరుకూటి నూకరాజు తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల దత్తతపై అవగాహన



పిల్ల సంరక్షపాణ మేరీ సువార్త

అనకాపల్లి టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారిని దత్తత ఇచ్చే విధంగా అవగాహన కల్పిస్తున్నామని మిషన్ కో-ఆర్డినేటర్ కె.మేరీసువార్త అన్నారు. మహిళా శిశుసంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో జాతీయ దత్తత అవగాహన మాసోత్సవాల్లో భాగంగా ఇక్కడి విజయరామరాజుపేట అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్, కె.ఎల్.మనోహర్, భాను, రూప, రంజిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'బీమా రంగానికి మంచి రోజులు'



ఉద్యోగులను సత్కరించిన లీడ్ బ్యాంక్ మేనేజర్

అనకాపల్లి టౌన్, నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి) : పట్టంలోని ఉడ్‌పేటలో గల యూనియన్ బ్యాంక్‌లో సోమవారం ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ 16వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ, లక్ష్మీనారాయణలు బ్యాంకు ఉద్యోగులను సత్కరించారు. ఈ సందర్భంగా ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ అనకాపల్లి ఇన్‌చార్జి ఆళ్ల యశోధ మాట్లాడుతూ బ్యాంకు సిబ్బంది ప్రోత్సాహకాన్ని కొనియాడారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఇన్సూరెన్స్ రంగానికి మంచి రోజులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో టి.శోభనాద్రి, ఆడారి గోవిందరావు, చిరంజీవి, ఆడారి చంద్రశేఖర్, కాండ్రేగుల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కన్నూరుపాలెం మాజీ సర్పంచ్ ఎర్రినాయుడు మృతి



ఎర్రినాయుడు (ఫైల్)

కశింకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నాయకుడు, కన్నూరుపాలెం మాజీ సర్పంచ్ కన్నూరు ఎర్రినాయుడు అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. సోమవారం కుటుంబ సభ్యులు చేపట్టిన అంతిమ యాత్రకు మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు హాజరై నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ కూండ్రపు రామునాయుడు, నాయకులు ఉగ్గిన రమణమూర్తి, ప్రసాద్, శ్రీరామ్మూర్తి, వేగి గోపీకృష్ణ, కూండ్రపు అక్కునాయుడు, కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు), బాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కూలే స్థితిలో విద్యుత్ స్తంభం

- పరవాడలో భయం...భయం...



తుప్పు పట్టిన స్తంభం అడుగుభాగం

పరవాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ ప్రధాన రహదారిలోని గ్రామీణ వికాస్ బ్యాంకు వద్ద ఉన్న ఎల్ఈడీ విద్యుత్ స్తంభంతో ప్రమాదం పొంచి ఉంది. తుప్పు పట్టి అడుగు భాగంలో రంధ్రాలు ఏర్పడ్డాయి. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. స్తంభం అడుగు భాగం చుట్టూ సపోర్ట్‌గా సిమెంట్‌ను నిర్మించక పోవడంతో ఈ సమస్య తలెత్తిందని స్థానికులు చెబుతున్నారు. పెద్ద ఎత్తున గాలి వీస్తే ఎప్పుడు ఏం జరుగుతుందోనని హడలి పోతున్నామన్నారు. పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా మేయర్ 'పీలా' జన్మదిన వేడుకలు





ఎన్టీఆర్ వైద్యాలయంలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న మళ్ల సురేంద్ర, తదితరులు

అనకాపల్లి టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెంలోని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ కార్యాలయంలో విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో గర్భిణులకు, బాలింతలకు, రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, టీడీపీ నాయకులు కర్రి బాబి, బొలిశెట్టి శ్రీనివాసరావు, బీఎస్ఎంకే జోగినాయుడు, పోలారపు త్రినాథ్, బొద్దపు ప్రసాద్, ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

సబ్బవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు జరుపుతామన్నారు. బీస్సి కంప్యూటర్ సైన్స్ ఒకటి, బీఎస్సీ బోటనీ 31, బీకాం కంప్యూ టర్ అప్లికేషన్స్ 7, బీఏ చరిత్ర నాలుగు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఒరిజినల్, జెరాక్స్ సెట్ సర్టిఫికెట్లుతో హాజరు కావాలని సూచించారు.

శిశు మరణాలకు కారణం ముందస్తు జననాలు



ప్రపంచ అకాల జనన దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ

పాడేరురూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శిశు మరణాలకు ముందస్తు జననాలు ప్రధాన కారణమని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్. సీహెచ్.కమలకుమారి అన్నారు. ప్రపంచ అకాల జనన దినోత్సవం కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్.డి.కృష్ణమూర్తి నాయక్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ఆస్పత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీని చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది ప్రీ మెచ్యూర్ శిశువుల సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో పి.సింహాచలం, డీపీహెచ్ఎన్‌వో భూలోకమ్మ, జిల్లా ఆస్పత్రి నర్సింగ్ సూరింటెండెంట్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలందించండి

▸▸ జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్


విద్యార్థినుల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకుంటున్న ఎంవీవీ ప్రసాద్

కొయ్యూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల ఆరోగ్య స్థితిగతులు పూర్తిగా కుదుట పడే వరకు వైద్య సేవలు కొనసాగించాలని జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్ సూచించినట్టు తెలిపారు. విశాఖ కేజీహెచ్‌లో వైద్య సేవలు పొందుతున్న జర్తా హాసిని, టి. కీర్తి ప్రసన్నలను సోమవారం ఆయన పరామర్శించారు. అనంతరం వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నట్టు ప్రసాద్ తెలిపారు. వారు పూర్తిస్థాయిలో కోలుకునేంత వరకు వైద్యసేవలు అందించాలని పాఠశాల డిప్యూటీ వార్డెన్ జ్యోతికి సూచించారని ఆయన చెప్పారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొయ్యూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాలెం మహిళ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు చేసుకునేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.సుధ తెలిపారు. ఇంటరు పాసైన గిరిజన విద్యార్థినులు బీఏ, బీకాం, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ మ్యాథ్స్ గ్రూపుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. విద్యార్థినులు 20వ తేదీలోగా నేరుగా కళాశాలను సంప్రదించాలన్నారు. కళాశాలలో హాస్టల్ సదుపాయం ఉందన్నారు.

విద్యార్థినుల అస్వస్థతపై ఎమ్మెల్యే ఆరా


విద్యార్థుల పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే, ఎంపీపీ

కొయ్యూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజేంద్రపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థుల అస్వస్థతపై పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ సోమవారం పాఠశాలను సందర్శించి, ఘటనపై ఆరా తీశారు. హెచ్‌ఎం గోపాలంతో సమావేశమై సంఘటనకు గల కారణాలపై చర్చించారు. ఫుడ్ పాయిజన్ అయ్యిందనే వాదనపైన, మెనూ అమలు తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అస్వస్థతకు లోనైన విద్యార్థులను పరామర్శించారు. వైద్యాధికారిని కలిసి విద్యార్థుల ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట వైసీపీ మండల అధ్యక్షుడు బి. అప్పారావు, పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ సూరిబాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దేముడు, మండల కార్యదర్శి ఉల్లి సూరిబాబు ఉన్నారు.

లంబసింగి పంచాయతీకి రూ.6.78 లక్షల ఇంటి పన్ను చెల్లింపు


పంచాయతీ కార్యదర్శికి చెక్ అందజేస్తున్న ఏపీటీడీసీ యూనిట్ మేనేజర్ అప్పలసూరి

చింతపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): లంబసింగి పంచాయతీకి ఏపీటీడీసీ హరిత రిసార్ట్స్ ఇంటి పన్ను రూ.6.78లక్షలు చెల్లించినట్టు యూనిట్ మేనేజర్ సూరెడ్డి అప్పలసూరి తెలిపారు. సోమవారం హరిత రిసార్ట్స్‌కి సంబంధించిన రెండేళ్ల ఇంటి పన్నుని పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. ఈసందర్భంగా యూనిట్ మేనేజర్ మాట్లాడుతూ రిసార్ట్స్ ద్వారా 15 మంది గిరిజనులకు ఉపాధి కల్పించామన్నారు. అలాగే రిసార్ట్స్‌కి పంచాయతీ నిర్ణయించిన ఇంటి పన్ను పూర్తిగా చెల్లించామన్నారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి పి. అప్పలరాజు, మాజీ సర్పంచ్ కొర్ర రఘునాథ్ పాల్గొన్నారు.

'విద్యార్థులు డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలి'

చింతపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలని ఈగల్ బృందం ఆర్ఎస్ఐ శ్రీరామమూర్తి అన్నారు. సోమవారం జాజులపాలెం గిరిజన సంక్షేమశాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఈగల్ బృందం డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈసందర్భంగా ఆర్ఎస్ఐ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయికి అలవాటు పడితే విలువైన జీవితాలు నాశనమైపోతాయన్నారు. ఈకార్యక్రమంలో పీజీహెచ్ఎం ప్రసాద్ పాల్గొన్నారు.

గంజాయిపై విద్యార్థులకు అవగాహన అవసరం

పాడేరురూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక మదర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో సోమవారం గంజాయి, డ్రగ్స్ వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగల్ సీఐ రమేష్ రుద్ర మాట్లాడుతూ ఇటీవల కాలంలో యువత గంజాయి, డ్రగ్స్ బారిన పడడానికి గల కారణాలను, వాటి బారిన పడితే కలిగే నష్టాలను వివరించారు. మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్‌డీపీఎస్ సీఐ రవికుమార్, జిల్లా సోషల్ మీడియా సీఐ పి.వెంకట రమణ, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

'కాఫీ గింజల ధరలు ప్రకటించాలి'

చింతపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):గిరిజన సహకార సంస్థ కాఫీ గింజల ధరలు ప్రకటించాలని టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు బేరా సత్యనారాయణ పడాల్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఏడాది నవంబరు మొదటి వారంలో ధరలు ప్రకటించి, రెండో వారం నుంచి కొనుగోలు చేసేవారన్నారు. ఈ ఏడాది మూడో వారం వచ్చినప్పటికి జీసీసీ కాఫీ ధరలను ప్రకటించలేదన్నారు. మ్యాక్స్ కాఫీ పండ్ల సేకరణ, పల్పింగ్ ప్రారంభించకపోవడం వల్ల రైతులు పండ్లను ఎండబెట్టుకుని చెర్రీ చేసుకుంటున్నారన్నారు. దీని వల్ల అధిక ధర నష్టపోవాల్సి వస్తుందన్నారు. జీసీసీ సైతం మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తుందా? లేదా? అన్న సందేహాన్ని ఆదివాసీ రైతులు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికైన జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించి జీసీసీ కాఫీ ధరలు వెంటనే ప్రకటించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పాఠశాల ఆవరణ ఇలా.. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ ఎలా..


కొయ్యూరు కేజీబీవీ ఆవరణలో ఇంకుడు గుంత వద్ద నిలిచిన మురుగు

కొయ్యూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు కస్తూర్బా గాంధీ పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంత వద్ద మురుగు నిలిచిపోయింది. ఆ ప్రాంతవాసుల దుర్వాసన వెదజల్లుతోంది. ఇంకుడు గుంత నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. దీంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. పాఠశాల విద్యార్థులు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంటుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల ఆవరణలో పారిశుధ్య పరిస్థితి ఇలా ఉంటే విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎలా పరిరక్షిస్తారని మాజీ ఎంపీపీ గొలుసింగి సత్యనారాయణ, టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామ్మూర్తి ప్రశ్నిస్తున్నారు. తక్షణం పాఠశాల ఆవరణలో పారిశుధ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలని, లేకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు


భక్తులతో రద్దీగా మారిన ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం


అయ్యప్ప స్వామిని దర్శించుకొన్న జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్

పాడేరురూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయాలకు కార్తీక శోభ సంతరించుకుంది. కార్తీకమాసం నాలుగో సోమవారం కావడంతో ఉదయం 5 గంటల నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామ స్మరణతో మార్మోగాయి. ఉమానీలకంఠేశ్వరస్వామి దర్శనానికి భక్తులు క్యూ కట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల రామం ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, ఆధ్యాత్మిక ధర్మకర్త కొట్టగుళ్లి రమాదేవి పర్యవేక్షణలో కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, కె.భాగ్యలక్ష్మి, ఉప్పల వెంకటరత్నం, సిద్ధినాతి కొండలరావు, శివరాత్రి శ్రీనివాస్ కుమార్, వి.రాజబాబు, డి.బాబూరావు, బీవీఎస్.ముకుందరావు సేవలందించారు. మధ్యాహ్నం ఆలయంలో నిర్వహించిన అన్న సమారాధనలో భారీగా భక్తులు పాల్గొన్నారు. పేదలు, సాదువులకు వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ డి.దీనబంధు, ఎస్ఐ ఎల్.సురేష్ పర్యవేక్షణలో పోలీసు బందో బస్తును ఏర్పాటు చేశారు. అయ్యప్పస్వామి ఆలయంలోని సోమనాధేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సుబ్బారావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రతినిధులు తీర్థ ప్రసాదాలు, తాగునీరు అందించారు. స్వయం భూగౌరీలింగేశ్వర స్వామి ఆలయం, త్రిముఖ లింగేశ్వరస్వామి ఆలయంతో పాటు సంగోడి గ్రామంలోని స్ఫటిక లింగేశ్వరస్వామి ఆలయం, వంతాడపల్లి, ఇరడాపల్లి, గుత్తులపుట్టు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు.

అయ్యప్ప స్వామిని దర్శించుకున్న కిడారి

పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయాన్ని సోమవారం జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో అయ్యప్పమాల దారులు, భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డించారు. వారితో కలిసి ప్రసాదాన్ని స్వీకరించారు. శ్రావణ్‌కుమార్‌ను ఆలయ కమిటీ సభ్యులు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పి.పాండురంగస్వామి, ఆలయ కమిటీ ప్రతినిధులు వి.ఆదిత్య, రొబ్బి రాము, సత్తిబాబు, వర్మ రాజు, దామో తదితరులు పాల్గొన్నారు.

సీలేరులో

సీలేరు శివాలయంలో కార్తీక మాసం నాల్గో సోమవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ధ్వజ స్తంభం వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. సాయంత్రం ఆలయంలో గల నందీశ్వర అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


సీలేరు శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆదివాసీ సంప్రదాయాలు, సంస్కృతికి ప్రాధాన్యం ఇవ్వాలి : స్వామీ నిర్మలానంద


భక్తులనుద్దేశించి ప్రసంగిస్తున్న నిర్మలానంద

చింతపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సంప్రదాయాలు, సంస్కృతికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ స్వామీజీ నిర్మలానంద అన్నారు. కార్తీక సోమవారం పురస్కరించుకుని బౌడ శివాలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా స్వామీజీ నిర్మలాంద భక్తులనుద్దేశించి ప్రసంగిస్తూ కార్తీక మాసాన్ని అతి పవిత్రంగా ఆచరించాలన్నారు. శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం వల్ల శివుడు ఆశీస్సులు ప్రజలకు అనుగ్రహిస్తాయన్నారు. విదేశీ సంస్కృతికి దూరంగా ఉండాలన్నారు. భగవంతుడు అందరిలోనూ ఉంటాడని, అందరూ దైవ స్మరణ చేస్తే కష్టాలు అవే తొలగిపోతాయన్నారు. ఈకార్యక్రమంలో శివాలయం పరమ పూజ్య గురువులు రవి శంకర్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ జలుమూరి వెంకటగిరిబాబు, గ్రామపెద్దలు దొర, దేముడు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో 400 మంది చేరిక


దారకొండలో గంగులయ్య సమక్షంలో జనసేన పార్టీలో చేరిన గిరిజనులు

సీలేరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం ధారకొండలో జనసేన పార్టీ అరకు నియోజకవర్గ పార్లమెంట్ ఇన్‌చార్జి గంగులయ్య సమక్షంలో 400 మంది ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గంగులయ్య విలేకర్లతో మాట్లాడుతూ సీలేరు, దుప్పులవాడ, ధారకొండ, గుమ్మిరేవుల పంచాయతీల నుంచి 400 మంది జనసేన పార్టీలో చేరారన్నారు. రాబోయే రోజుల్లో జనసేన పార్టీ మరింతగా బలపడుతుందన్నారు. తమ దృష్టికి తీసుకొచ్చిన పలు సమస్యలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అరకు పార్లమెంటరీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీరవెంకట్, జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారామ్, మండల అధ్యక్షుడు కొయ్యం బాలరాజు, నాయకులు బాలకృష్ణ, అజయ్, రాము పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు


కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర

అరకులోయ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరగం పంచాయతీ పరిధిలో వర్రా గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. సుమారు 300 మంది టీడీపీలో చేరగా, వారికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొర్రా పోలన్న ఆధ్వర్యంలో నాయకులు జన్ని మధు, జన్ని అఖిల్, జన్ని రామచంద్ర, జిన్ని అప్పారావు, జన్ని బోడన్న, వంతల కొండబాబు, జన్ని అంగులు, జన్ని సత్తిబాబు, కిర్రా అప్పారావు, జన్ని సీతారాం తదితరులతో పాటు 300 మంది దొన్నుదొర సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ విద్యావంతులు రాజకీయాల్లోకి వస్తే సమాజానికి ఉపయోగమన్నారు. అటువంటి వ్యక్తి కొర్రా రత్నమ్మ అన్నారు. బీఏ బీఈడీ చదువుకొని గ్రామ అభివృద్ధి కోసం తపించిన మహిల అన్నారు. అమె పార్టీలోకి వచ్చి ప్రజాసేవ చేసేందుకు సుముఖత వ్యక్తం చేయడం శుభపరిణామమన్నారు. పార్టీబలోపేతానికి, సమాజబివృద్ధికి కృషి చేసిన వారికి మంచి గుర్తింపు, గౌరవం లభిస్తాయని దొన్నుదొర తెలిపారు. అలాగే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లకోయ్ మహాదేవ్, డుంబ్రిగుడ మంబల అధ్యక్షుడు కిల్లో ఆనందరావు, కోపరేటివ్ బ్యాంకు చైర్మన్ పెట్టెలి రాము, నాయకులు చందూ, విజయనిర్మల, వి.వెంకట్రావు, కె.నాగరాజు, పూజారి మాణిక్యం, నాగరాజు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి

జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖాధికారిణి ఝూన్సీభాయ్


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఝూన్సీభాయ్

ముంచంగిపుట్టు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి సిహెచ్.ఝూన్సీభాయ్ ఆదేశించారు. మండలంలోని దారెల పంచాయతీ పరిధిలో నెల రోజుల వ్యవధిలో ఐదు శిశు మరణాలు జరిగాయని పత్రికల్లో వచ్చిన వరుస కథనాలకు జిల్లా యంత్రాంగం స్పందించింది. ఈ మేరకు డి.కుమ్మరిపుట్టు, తలింబ గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించి, బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పసి పిల్లలు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. శిశువులు పుట్టిన నుంచి వారి ఆరోగ్య పరిస్థితులు, తల్లికి బిడ్డకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. ఆరోగ్య సమస్యలు తలెత్తితే సకాలంలో వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే భారీ నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.చంద్రమౌళి, సూపర్‌వైజర్లు వరహాలమ్మ, బ్లాక్ కోఆర్డినేటర్ సురేశ్, ఎంఎల్‌హెచ్‌పీ తులసి పాల్గొన్నారు.

గోమంగిలో వనభంగిని కలపొద్దని వినతి

పెదబయలు, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడనున్న గోమంగి ప్రత్యేక మండలంలో వనభంగి పంచాయతీని కలపవద్దని స్థానిక నాయకులు కోరారు. పంచాయతీలోని ఎనిమిది పెలా గ్రామాల నుంచి కమిటీల తీర్మానాలను సిద్ధం చేసుకొని సోమవారం పెదబయలు మండల మెజిస్ట్రేట్, ఎంపీడీవోలకు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వనభంగి పంచాయతీకి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో పెదబయలు మండల కేంద్రం ఉందని, రవాణా మొదలుకొని అన్ని కార్యక్రమాలకు వీలుగా ఉందని చెప్పారు. కొత్తగా గోమంగి ప్రత్యేక మండలంలో వనభంగి పంచాయతీని విలీనం చేస్తే అనేక ఇబ్బందులు ఎదురవుతాయని వాపోయారు. ఈ కార్యక్రమంలో వనభంగి పంచాయతీ పెసా కమిటీ ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, గిరిజనులు పాల్గొన్నారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయులు విధులకు డుమ్మా

ముంచంగిపుట్టు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం, అర్లాయిపుట్టు, దొబుగూడ గ్రామాల పాఠశాలల్లో ఎంటీఎస్ ఉపాధ్యాయులు విధులకు డుమ్మా కొడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కె.త్రినాథ్ కోరారు. గ్రామాల్లో పాఠశాలలను సోమవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి బాధలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో కొద్ది రోజులుగా ఎంటీఎస్ ఉపాధ్యాయులు విధులకు హాజరుకావడం లేదనే విషయం తెలిసిందని తెలిపారు.

సీఆర్‌పీఎఫ్ అన్న సమరాధన

ముంచంగిపుట్టు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ ఆధ్వర్యంలో అన్న సమరాధన నిర్వహించారు. అంతకు ముందు వారి బేస్ క్యాంప్‌లోని పీఠంలో అయ్యప్ప పూజ చేశారు. అనంతరం అన్న ప్రసాదం స్వీకరించారు. ఇన్‌స్పెక్టర్ సర్వన్, ఎస్ఐ జె.రామక్రిష్ణ, సీఆర్‌పీఎఫ్ పోలీసులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బస్తరు పిక్కలు కిలో రూ.300



గూడెంకొత్తవీధి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ రైతులు పండించిన బస్తరు పిక్కలకు రికార్డు స్థాయిలో ధర పెరిగింది. సోమవారం ఆర్‌వీనగర్ వారపు సంతలో వర్తకులు బస్తరు పిక్కలు కిలో రూ.300 ధరకు వర్తకులు కొనుగోలు చేశారు. ప్రతి ఏడాది నవంబరు మొదటి వారం నుంచి బస్తరు పిక్కలను ఆదివాసీ రైతులు వారపు సంతకు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. జనవరి మొదటి వారం వరకు ఇవి మార్కెట్‌లో అందుబాటులో ఉంటాయి. గత ఏడాది బస్తరు పిక్కలను కిలో రూ.150 ధరకు విక్రయించారు. ప్రస్తుతం గరిష్ఠ ధర లభించింది. వారం రోజుల్లో అధికంగా పిక్కలు మార్కెట్‌కి వస్తే ధర తగ్గుతుంది.

అనారోగ్యంతో మాజీ ఎంపీపీ పద్మ మృతి


పద్మ (ఫైల్‌ఫొటో)

జి.మాడుగుల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగురోళ్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కొర్రా పద్మ అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురైన పద్మను విశాఖపట్నం కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ వైద్యం పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందింది. ఈమె గడిచిన రెండున్నరేళ్లు ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం గడుతూరు ఎంపీటీసీ సభ్యురాలుగా కొనసాగుతున్నారు. మాజీ ఎంపీపీకి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పద్మ మృతి పట్ల టీడీపీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోమవారం గానుగురోళ్ల వెళ్లి పద్మ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు.

గొడుగురాయి రహదారి పనులు పూర్తి చేయాలి

జి.మాడుగుల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గెమ్మెలి పంచాయతీ గొడుగురాయి రహదారి పనులు పూర్తి చేయాలని స్థానికులు సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకుడు సాగిన ధర్మనపడాల్ మాట్లాడుతూ.. గొడుగురాయి గ్రామానికి గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్డు పనులు కొంతవరకు చేసి వదిలేశారన్నారు. మిగిలిన రహదారి పనులు చేయలేదని, పనులు పూర్తి చేయకుండా నిధులు కాజేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈనెల 25న చలో కలెక్టరేట్ నిర్వహిస్తామని హెచ్చరించారు.

ధారకొండను మండల కేంద్రంగా చేయాలి

▸▸ గంగులయ్యకు సాధన కమిటీ వినతి


గంగులయ్యకు వినతిపత్రం అందజేస్తున్న మండల సాధన కమిటీ సభ్యులు

సీలేరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ధారకొండను మండల కేంద్రంగా ఏర్పాటు చేయడానికి సహకరించాలని జనసేన పార్టీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, జానపద సాంస్కృతిక కళల చైర్మన్ వంపూరి గంగులయ్యను ధారకొండ మండల సాధన కమిటీ సభ్యులు కోరారు. సోమవారం ఆయన ధారకొండ రావడంతో కమిటీ సభ్యులు కలిసి సమస్యను వివరించారు. దీనిపై గంగులయ్య మాట్లాడుతూ జిల్లాలు, మండలాల విభజన కమిటీలో తమ పార్టీ తరుపున ఉన్న మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళతానన్నారు. ఈ కార్యక్రమంలో మండల సాధన కమిటీ సభ్యులు విష్ణుమూర్తి, ఈశ్వరరావు, బాలకృష్ణ, రాజు తదితరు పాల్గొన్నారు.

'అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'

కొయ్యూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):గిరిజన ప్రాంత అభివృద్ధి, గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల కార్యదర్శి తోట దొరబాబు అన్నారు. సోమవారం డౌనూరు పంచాయతీ రొబ్బసింగి, రెల్లలపాలెం గ్రామాలలో రూ.27 లక్షలతో చేపట్టనున్న పాఠశాలల భవనాల నిర్మాణానికి కొయ్యూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ సుమర్ల సాంబశివ, సర్పంచ్ భవానిలతో కలిసి దొరబాబు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో తెలుగుమహిళ మండల అధ్యక్షురాలు బోనంగి సత్యవతి, ఏఎంసీ డైరెక్టర్లు రాజేశ్వరిదేవి, మండల ఉపాధ్యక్షురాలు రమాదేవి, ఉప సర్పంచ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఆశ్రమ' విద్యార్థులకు ఉచిత కరాటే శిక్షణ

చింతపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):ఆశ్రమ పాఠశాల్లో నెల రోజుల పాటు ఉచిత కరాటే శిక్షణ ఇస్తామని కోఫోకాన్ కరాటే జిల్లా ముఖ్య శిక్షకుడు బాకూరు పాండురాజు అన్నారు. సోమవారం స్థానిక ఏఎస్పీ నవజ్యోతి మిశ్రాను పాండురాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ఏఎస్పీ సూచన మేరకు ఆశ్రమ పాఠశాలల్లో కరాటే శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. డిసెంబరులో ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభిస్తామన్నారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులు కరాటే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మెగా క్రిస్మస్ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ



మెగా క్రిస్మస్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూసీవైఏ ప్రతినిధులు

పాడేరురూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): యునైటెడ్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి మెగా క్రిస్మస్ వేడుకల పోస్టర్‌ను పాస్టర్లు, యూసీవైఏ ప్రతినిధులు ఆవిష్కరించారు. డిసెంబరు 13వ తేదీన పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఈ వేడుక ఉంటుందని అసోసియేషన్ చీఫ్ రీమాలి జాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ఎం.బాబూరావు, టి.లక్ష్మణరావు, ఎస్.సాల్మాన్, ఎం.డానియల్, సీహెచ్.జీవన్, యోబు, తిమోతి, సుధాకర్, యూసీవైఏ ప్రతినిధులు కె.సుజిత్, మత్స్యలింగం, ఎం.స్టీవెన్, డి.రవికుమార్, ఓ.జ్ఞానప్రకాశ్ పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాలపై ఆర్‌జేడీ పరిశీలన


విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఆర్‌జేడీ విజయ్‌భాస్కర్

అనంతగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆశ్రమ పాఠశాలలను రీజినల్ జాయింట్ డైరెక్టర్ విజయ్‌భాస్కర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కొత్తూరు కేజీబీవీ, శివలింగపురం ఆశ్రమ బాలురు తనిఖీ చేసి, విద్యా సామర్థ్యలను పరిశీలించారు. అనంతరం బొర్రా ఆశ్రమ బాలురు, టోకూరు ఆశ్రమ బాలికలు, అనంతగిరి-1 పాఠశాలను సందర్శించారు. పాఠ్య పుస్తకాలను విద్యార్థులతో చదివించారు. విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని ఆదేశించారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలోని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా తగిన శిక్షణ ఇవ్వాలని ఆయన సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈఈ కర్రి శంకరరావు సోమవారం తెలిపారు. తారువ, బి.కింతాడ సబ్ స్టేషన్ల పరిధిలోని ములకలాపల్లి, కొత్తపెంట, మారేపల్లి గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఈ అంతరాయాన్ని గమనించి ఆయా గ్రామాల ప్రజలు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

జీలుగులోవ ఆదివాసీలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

రావికమతం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చీమలపాడు పంచాయతీలోని శివారు కొండశిఖర గ్రామం జీలుగులోవలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆదివాసీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో తహశీల్దార్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ ఇక్కడ ఆదివాసీలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్లు మంజూరు చేయాలని అనేక దఫాలుగా వినతులు అందజేస్తున్నామన్నారు. అయినప్పటికీ ఫలితం లేకపోతున్నదని వాపోయారు. కూటమి ప్రభుత్వం హయాంలోనైనా జీలుగులోవ ఆదివాజీలకు స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సీదరి రాజు, కొర్రా భీమరాజు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని వినియోగించుకోండి

▸▸ నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేశ్



గొలుగొండపేటలో క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు అందిస్తున్న రాజేశ్

నాతవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి కేంద్రం (స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్)ను యువకులు వినియోగించుకోవాలని నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ సూచించారు. మండలంలోని గొలుగొండపేట గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా దాతల సాయంతో ఎస్ఐ తారకేశ్వరరావు ఏర్పాటు చేసిన స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్, మైత్రీ లైబ్రరీలను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం సరుగుడు, సందరకోట తదితర ఏజెన్సీ గ్రామాల నుంచి వచ్చిన క్రీడకారులకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ ఈ కేంద్రాలకు యువకులు తరచూ వచ్చి పోటీ పరీక్షల పుస్తకాలు చదివి ఉద్యోగాలు తెచ్చుకోవాలన్నారు. మైత్రీ లైబ్రరీకి వివిధ రకాల 40 వేల పుస్తకాలను వీవీ శర్మ, ఎక్సైజ్ సీఐ మోహనరావు అందించడం అభినందనీయమన్నారు. అలాగే వచ్చే ఏడాది నర్సీపట్నంలో ఐఏఎస్, ఐపీఎస్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసే ఆలోచన ఉందని రాజేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, నాతవరం పీఏసీఎస్ చైర్మన్ అప్పిరెడ్డి మాణిక్యం, ఏఎంసీ డైరెక్టర్ వీవీ.కృష్ణారావు మాజీ ఎంపీపీ ఎన్.విజయ్‌కుమార్, కూటమి నాయకులు పోలుపర్తి సాయి, ఇటంశెట్టి సీతారామ్మూర్తి, వెలగల వెంకటరమణ, అల్లాడి సురేశ్, హరినాథ్, ఆర్‌పీఎస్ చంద్ర, పారుపల్లి వెంకటరమణ, జి.చిట్టిబాబు, ఎం.దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు సర్వే

▸▸ కొత్తకోట వైద్యాధికారిణి సురేఖ


కొత్తకోటలో ఇంటింట సర్వే చేస్తున్న డాక్టర్ సురేఖ, సిబ్బంది

రావికమతం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు సర్వే చేస్తున్నామని వైద్యాధికారిణి సురేఖ తెలిపారు. గ్రామంలో సోమవారం సిబ్బందితో కలిసి ఇంటింట సర్వే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 48 ఆరోగ్య బృందాల సభ్యులు అన్ని గ్రామాల్లోనూ ఈ సర్వే చేస్తారని చెప్పారు. సర్వే ద్వారా శరీరంపై నొప్పి లేని రాగి రంగు మచ్చలు ఉన్నవారిని గుర్తించాలని ఆమె సూచించారు. సకాలంలో మందులు వాడితే వ్యాధిగ్రస్థులకు చేతులు, కాళ్లు వంకర పోకుండా జాగ్రత్త పడవచ్చునన్నారు. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి తగిన చికిత్స తీసుకుంటే పూర్తిగా నయమవుతుందని చెప్పారు. దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి పాతాళ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డ్ తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సాగుదారులు

నర్సీపట్నం అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని పాతమల్లంపేట గ్రామంలో సర్వే నంబర్ 850-1లో 23.4 ఎకరాల భూమిని తప్పుడు రికార్డులతో అడ్డగోలుగా ఓ ఎన్ఆర్ఐ పేరున ఆన్‌లైన్ చేసి సాగుదారులకు తీవ్ర అన్యాయం చేసిన రిటైర్డ్ తహశీల్దార్ శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తమకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. గత ఏడాది డిసెంబరులో పాతమల్లంపేటలో జరిగిన రెవెన్యూ సదస్సులో కూడా దరఖాస్తులు ఇచ్చామన్నారు. ఏళ్ల నుంచి సాగులో ఉన్న గిరిజనులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఈ భూములను రిటైర్డ్ తహశీల్దార్ శ్రీనివాసరావు ఎన్ఆర్ఐ దుగ్గిరాల రామకృష్ణ పేరున ఆన్‌లైన్ చేసి రికార్డులు తయారుచేశారన్నారు. తహశీల్దార్ శ్రీనివాసరావు అక్రమాలపై విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయం డీటీ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జనార్ధన్, ఎం.రాజు పాల్గొన్నారు.

ఎడ్లవీధిలో తాగునీటి సమస్య పరిష్కారం


బోరు తవ్వకాలను ప్రారంభిస్తున్న నేతలు

చోడవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎడ్లవీధిలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. స్థానిక నాయకుల వినతుల మేరకు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు బోరు మంజూరు చేశారు. దీంతో ఎడ్లవీధిలో బోరు తవ్వకానికి సోమవారం నాయకులు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎర్రంశెట్టి చిన్న, టీడీపీ నాయకులు బొంతు దేముడు బాబు, గొర్లె సుధాకర్, ఈర్లె శ్రీనివాస్, మాదిరెడ్డి జోగినాయుడు, కొటాన సత్తిబాబు, నానబెల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.


నర్సీపట్నం: బలిఘట్టం శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు, అర్చకులు



దేవరాపల్లిలోని తిమిరాం ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు... మాడుగుల ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

శివ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

తెల్లవారు జాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు

నర్సీపట్నం/నర్సీపట్నం అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శివ నామస్మరణతో మార్మోగాయి. నర్సీపట్నంలోని బలిఘట్టం బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారు జాము నుంచే భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే చెట్టుపల్లిలోని ఐశ్వర్యాంబిక సహిత అనంతేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు హాజరై అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.


కె.కోటపాడు: అర్లి శివాలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట: మండలంలో విజయరామరాజుపేట, వడ్డాది, బంగారుమెట్ట, రాజాం, నీలకంఠాపురం, చిట్టియ్యపాలెం, సీతయ్యపేట గ్రామాల్లోని శివాలయాలకు వేకువ జాము నుంచి భక్తులు తాకిడి పెరిగింది. చలిని లెక్క చేయకుండా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. బంగారుమెట్ట కాశీఅన్నపూర్ణవిశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు అన్న సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



బుచ్చెయ్యపేట: అన్నసమారాధన ప్రారంభిస్తున్న బత్తుల తాతయ్యబాబు.. రావికమతం ఆలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు

మాడుగులలో...

మాడుగుల: మండలంలోని శివాలయాలు భక్తుల శివ నామస్మరణతో మార్మోగాయి. తెల్లవారు 2 గంటల సమయానికి భక్తులు ఆలయాలకు చేరుకున్నారు. సమీపంలోని బావుల వద్ద చన్నీటి స్నానమాచరించి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. మాడుగుల మండల కేంద్రంలోని కృష్ణ భూపాలేశ్వర, ఉబ్బలింగేశ్వర, భీమలింగేశ్వర, స్వర్గలింగేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు రద్దీ ఏమాత్రం తగ్గలేదు. మండల పరిసర గ్రామాల్లో చరిత్ర కలిగిన జంపెన శివాలయం, ఎం.కోడూరు కాశీవిశ్వేశస్వామి ఆలయాలకు కూడా భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: మండలంలోని అన్ని శివాయాలు భక్తులతో కిటకిటలాడాయి. తిమిరాం శివాలయంలో మాజీ డిప్యూటీ సీఎం బూడిముత్యాలనాయుడు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వనదేవీశ్వర ఆలయం, పెద నందిపల్లి, చిననందిపల్లి, బి.కింతాడ, తెనుగుపూడి శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. చోడవరం, చీడికాడ, దేవరాపల్లి మండలాల నుంచి భక్తులు తిమిరాం శివాలయానికి అధిక సంఖ్యలో వెళ్లారు. అలాగే ములకలాపల్లిలో అభయాంజనేయ 21వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. తిమిరాంలో మంగళవారం అన్నసమారాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

కె.కోటపాడులో...

కె.కోటపాడు: మండలంలోని శివాయలాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామివారిని దర్శిం చుకున్నారు. కె.కోటపాడుతో పాటు అర్లి, చంద్రయ్యపేట, గొండుపాలెం, చౌడువాడ, కోడూరు, ఆనందపురం తదితర గ్రామాల్లో శివాలయాలు కిటకిటలాడాయి. పలు గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు జేగురుపాటి భీమలింగేశ్వరరావు స్వామి వారికి మారేడు దళాలతో అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం హర హర మహదేవ నినాదాలతో మార్మోగింది. మహిళలు దీపాలు వెలిగించి వ్రతాలు నిర్వర్తించారు. కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం గౌరవాధ్యక్షులు శరగడం సన్యాసినాయుడు పాల్గొన్నారు.

రావికమతంలో...

రావికమతం: కార్తీక మాసం ఆఖరి సోమవారం కావడంతో వేకువ జామునుంచే రావికమతం, కొత్తకోట, కల్యాణపులోవ పోతురాజుబాబు, మేడివాడ, కవ్వగుంట గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిలాడాయి. తెల్లవారు జాము నుంచే పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే ధ్వజ స్తంభాల వద్ద దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. రావికమతం శివ పంచాయతన ఆలయంలో రాచకొండ లక్ష్మీనారాయణ, శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. పలువురు దాతలు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

గొలుగొండలో...

గొలుగొండ: ధారమఠం శివాలయం సోమవారం పర్యాటకులతో కిటకిటాలడింది.జలపాతంలో భక్తులు స్నానాలు ఆచరించి వన భోజనాలు చేశారు. అలాగే పాతమల్లంపేట ధారమల్లేశ్వరస్వామి ఆలయంలో వివిధ గ్రామాల భక్తులు సందడి చేశారు. దీంతో శివాలయం వద్ద పండగ వాతావరణం నెలకొంది.

అభ్యుదయ సైకిల్ యాత్రకు విశేష స్పందన

చోడవరంలో ఉత్సాహంగా సాగిన ర్యాలీ



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, పక్కన డీఎస్పీ శ్రావణి... ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, నాయకులు, విద్యార్థులు

చోడవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ నిర్మూలన లక్ష్యంగా పోలీసు శాఖ చేపట్టిన అభ్యుదయ సైకిల్ యాత్రకు విశేష స్పందన లభిస్తున్నది. చోడవరంలోని పాత బస్టాండ్ ఆవరణలో పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన ఈ యాత్రను అనకాపల్లి డీఎస్పీ శ్రావణి, ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రారంభించారు. సైకిల్ తొక్కుతూ ఎమ్మెల్యే రాజుతో పాటు సీఐ అప్పలరాజు అభ్యుదయ సైకిల్ యాత్రలో పాల్గొన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీకి కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పాత బస్టాండ్ ఆవరణ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ప్రధాన రహదారి మీదుగా కొత్తూరు జంక్షన్‌కు చేరింది. అనంతరం కొత్తూరు కూడలిలో మానవహారం నిర్వహించిన విద్యార్థులు, పోలీసులు, నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి: ఎమ్మెల్యే రాజు

ప్రతి ఒక్కరూ సమాజానికి జాడ్యంగా తయారైన డ్రగ్స్, మాదక ద్రవ్యాల వినియోగాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు కోరారు. అభ్యుదయ సైకిల్ యాత్రలో భాగంగా పాత బస్టాండ్ కూడలిలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సమాజంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అందరినీ చైతన్యం చేయాలని విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్‌కు బానిసలుగా కాకుండా, ఆరోగ్యానికి ఉపయోగపడే క్రీడలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని కోరారు. అలాగే మంచి సమాజం కోసం పాటుపడాలని కోరుతూ ప్రతిజ్ఞలు చేయించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రావణి, ఎస్ఐలు జోగారావు, నాగకార్తీక్, ఎంపీడీవో ఆంజనేయులు, రెవెన్యూ అధికారులు, మండల, పట్టణ టీడీపీ అధ్యక్షులు కనిశెట్టి మత్సరాజు, ఎర్రంశెట్టి చిన్న, సకురు కోటేశ్వరరావు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీలో ఇంత నిర్లక్ష్యమేల..!

▸▸ సంస్థ సొత్తు పరులపాలవుతున్నా చోద్యం చూస్తున్న అధికారులు


మూతబడి ఉన్న మాడుగుల ఆర్‌అండ్‌బీ కార్యాలయం

మాడుగుల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సొత్తు పరుల పాలవుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. సంస్థ వనరులను అక్రమంగా యథేచ్ఛగా తరలించుకుపోతున్నా చోద్యం చూస్తున్నారు. దీంతో 'ఆర్‌అండ్‌బీలో మరీ నిర్లక్ష్యమేల..'అని ప్రజలు తీవ్రంగా అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మాడుగుల ఆర్‌అండ్‌బీ పరిధిలోని విలువైన చెట్లను నరకుపోతున్న విషయమై 'ఆర్‌అండ్‌బీ రోడ్లలో యథేచ్ఛగా చెట్ల నరకివేత' అనే శీర్షికతో ఈ నెల 14వ తేదిన 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇక్కడి కార్యాలయాన్ని రోజువారి అక్కడుంటే వాచ్‌మేన్ తులపులు తెరిచి సాయంత్రం సమయానికి తలుపులు మూత వేసిన పరిస్థితి తప్పితే వారంలో ఒక్కరోజు కూడా ఇక్కడ కార్యాలయానికి అధికారులు వచ్చిన దాఖలాలు లేవు. ఎక్కడో పట్టణ ప్రాంతాల్లో ఉంటూ ఇక్కడ పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. దీంతో అక్రమార్కులు ఇదే అదనుగా భావించి ఆర్‌అండ్‌బీ పరిధిలోని విలువైన చెట్లను పట్టపగలే యథేచ్ఛగా నరికి తరలించుకుపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ ఎలాగూ లేదు. సరికదా పత్రికలో కథనం వెలువడినా ఉదాసీనంగా వ్యవహరించడంపై స్థానికులు దుమ్మెత్తిపోస్తున్నారు. ఇప్పటికైనా అధికారుల తీరు మారాలని వారు కోరుతున్నారు.

భారీ అన్న సమారాధన

మాడుగుల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మాడుగుల పార్థసారథి ఆలయ సమీపంలోని స్వర్గలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం భారీ వన అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ప్రతి ఏడాది నాలుగో సోమవారం శివ భక్తులు విరాళాలు సేకరించి శివ భక్తులు, అయ్యప్ప, భవానీ మాలధారణ భక్తులకు వన సమారాధన నిర్వహిస్తారు. ఈ ఏడాది నిర్వహించిన కార్యక్రమానికి నాలుగు వేల మందికిపైగా భక్తులు తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

క్విజ్ పోటీలు

కె.కోటపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడువాడ శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఈ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి ఎం.పద్మావతి మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ముగింపు రోజున బహుమతులు ప్రదానం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గొలుగొండలో...

గొలుగొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. అలాగే గ్రంథాలయాల ప్రాముఖ్యత గ్రంథాలయాధికారిణి వరలక్ష్మి విద్యార్థులకు వివరించారు.


కె.కోటపాడు: క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ

రోలుగుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రత్నంపేటలో రూ.2 లక్షల ఎంపీపీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. గ్రామంలో ఏళ్ల నుంచి పలు వీధుల్లో సీసీ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను స్థానిక నాయకులు ఎంపీపీ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు ఎంపీపీ గ్రాంట్ నుంచి నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.వెంకటరమణ, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.


రత్నంపేటలో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

చింతపాక రేషన్ డిపోలో తనిఖీలు

బుచ్చెయ్యపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చింతపాక రేషన్ డిపో సోమవారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. బియ్యం 110 కిలోలు అదనంగా ఉన్నట్టు గుర్తించారు. దీంతో డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్టు సీఎస్‌డీటీ భాస్కరరావు తెలిపారు. ఐవీఎఫ్‌లో వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీలు చేశామని, డీలర్‌ను విధుల నుంచి తొలగించామని ఆయన తెలిపారు.


డిపోలో తనిఖీలు చేస్తున్న అధికారులు

ఐదేళ్లు నిండితే బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలి

మాడుగుల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లు దాటిన పిల్లలు ఆధార్ కార్డును తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. పిల్లలు పుట్టిన వెంటనే చేయించిన ఆధార్ కార్డుకు వేలిముద్ర, కంటి వివరాలు తీసుకోదని, తల్లిదండ్రుల బయోమెట్రిక్ ద్వారా పిల్లలకు ఆధార్ కార్డు మంజూరు చేశారని చెప్పారు. ఐదేళ్లు దాటిన తరువాత పిల్లలకు అప్‌డేట్ చేయించుకోకపోతే ఆధార్ కార్డు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయాన్ని గమనించి పిల్లల ఆధార్ అప్‌డేట్ చేయించాలని కోరారు.

పర్యాటక ప్రాజెక్టుల వెల్లువ

- భాగస్వామ్య సదస్సులో బోలెడు ఒప్పందాలు
- ఉమ్మడి జిల్లాలో అరకులోయ, లంబసింగిల్లో కారవాన్ పార్కులు
- అరకులో కాఫీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్
- భూమి కేటాయింపునకు ప్రభుత్వం అంగీకారం
- 'కల్చరల్ కారవాన్ ఇండియా' ఎంవోయూ
- ఆనందపురం మండలం దబ్బందలో వెల్‌నెస్ సెంటర్, అడ్వంచర్ అండ్ ఎకో టూరిజం సెంటర్ ఏర్పాటుకు 'వరల్డ్ బ్లిస్' ఒప్పందం
- రూ.100 కోట్లతో 'నవతరం' స్టూడియో ఏర్పాటుకు ఒప్పందం
- రూ.150 కోట్లతో 'సన్ ఇనిస్టిట్యూట్' హోటల్ నిర్మాణం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో రెండు రోజులు జరిగిన సీఐఐ పెట్టుబడిదారుల సదస్సులో పర్యాటక రంగానికి సంబంధించి పలు ఒప్పందాలు కుదిరాయి. ఇందులో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు సంబంధించి ఎక్కువగా బీచ్ రిసార్ట్స్, వెల్‌నెస్ సెంటర్లు, ఎకో టూరిజం ప్రాజెక్టులు, అడ్వంచర్ స్పోర్ట్స్, కార్వాన్లు వంటివి ఉన్నాయి.

అరకులోయ, లంబసింగిల్లో కారవాన్ పార్క్‌లు ఏర్పాటు చేయడానికి వైజాగ్ రిక్రియేషన్స్ సంస్థ ముందుకువచ్చింది. పర్యాటకులను గమ్యస్థానాలకు చేర్చడానికి వసతులతో కూడిన వాహనాలు మాత్రమే ఉపయోగిస్తే వాటిని 'కారవాన్'గా వ్యవహరిస్తారు. అలా కాకుండా నిర్దేశించిన గమ్యస్థానాల్లో కొంత స్థలం తీసుకొని పర్యాటకులకు రెస్టారెంట్, రాత్రి బస చేయడానికి కూడా వసతులు కల్పిస్తే వాటిని 'కారవాన్ పార్కు'లుగా పేర్కొంటారు. వైజాగ్ రిక్రియేషన్స్ సంస్థ అరకు, లంబసింగిల్లో కారవాన్ పార్కులు పెడుతుంది. దీనికి అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం లీజు పద్ధతిలో సమకూరుస్తుంది. దీనికి సంబంధించి ఆయా జిల్లాల కలెక్టర్లు సహకరిస్తారు. ఈ వారంలోనే భూమిని చూపించి లీజు ఒప్పందానికి వెళతారని సమాచారం. ఈ రెండు ప్రాంతాలతో పాటు బాపట్లలో కూడా కారవాన్ పార్క్ ఏర్పాటుకు ఈ సంస్థ ఒప్పందం చేసింది. మొత్తం రూ.15 కోట్ల పెట్టుబడితో 145 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పి



స్తారు. అలాగే ఓజీ డ్రీమ్‌లైనర్స్ అనే సంస్థ కారవాన్లు అద్దెకు ఇస్తామని ఎంఓయూ చేసింది. రూ.25 కోట్ల పెట్టుబడితో 80 మందికి ఉద్యోగాలు ఇవ్వనుంది. అదేవిధంగా శ్రీనివాస్ కారవాన్స్ సంస్థ రూ.2 కోట్లతో 20 మందికి ఉపాధి కల్పిస్తామని ఒప్పందం చేసింది. వీరంతా పర్యాటకుల సంఖ్య ఆధారంగా ఎక్కడ డిమాండ్ ఉంటే అక్కడి నుంచి కారవాన్లు నడుపుతారు. అద్దెకు ఇస్తారు.

కాఫీ ఎక్స్‌పీరియెన్స్ సెంటర్

సదస్సులో అరకు కాఫీ గురించి సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, అరకులో కాఫీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దీనికి సంబంధించి కూడా అవగాహన ఒప్పందం కుదిరింది. 'అరకు గోల్డ్ కాఫీ' పేరుతో ఎక్స్‌పీరియెన్స్ సెంటర్ పెట్టడానికి ఓ సంస్థ చొరవ చూపింది. రెండు కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటయ్యే ఈ సెంటర్ ద్వారా 1,020 మందికి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చింది. కాఫీ ఎలా పండుతుంది?, దానిని ప్రాసెస్ చేసి కాఫీ పొడిగా ఎలా తయారుచేస్తారు?...వంటి అంశాలన్నీ అక్కడ పర్యాటకులకు కళ్లకు కట్టినట్టు చూపిస్తారు. ఇది మంచి ప్రాజెక్టుగా నిలుస్తుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

దబ్బందలో వెల్‌నెస్ సెంటర్

ఆనందపురం మండలంలోని శొంఠ్యాం సమీపాన దబ్బందలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు విజయనగర్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థ ఎంఓయూ చేసింది. సుమారుగా ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు సంస్థ అధినేత తిరుపతిరాజు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. దాదాపు రూ.45 కోట్ల పెట్టుబడితో ఏర్పాటయ్యే ఈ వెల్‌నెస్ సెంటర్‌లో 170 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

వరల్డ్ బ్లిస్ అనే సంస్థ కూడా ఇంటిగ్రేటెడ్ వెల్‌నెస్ సెంటర్, అడ్వంచర్ అండ్ ఎకో టూరిజం సెంటర్ ఏర్పాటుకు ఎంఓయూ చేసింది. వీరు రూ.100 కోట్ల పెట్టుబడితో 500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఏ ప్రాంతంలో అనేది ఇంకా ఖరారు కాలేదు.

నవతరం సినీ స్టూడియో

రాష్ట్రంలో సినిమా షూటింగ్‌లకు అత్యంత అనుకూలమైనది ఉమ్మడి విశాఖ జిల్లానే. విశాఖపట్నం, భీమిలి, గంగవరం, అప్పికొండ, యారాడ, కొండకర్ల ఆవ ప్రాంతాలతో పాటు అరకు, లంబసింగి తదితర చోట్ల కొన్ని దశాబ్దాలుగా సినిమా షూటింగ్‌లు జరుగుతున్నాయి. విశాఖలో సినిమా స్టూడియోలు ఏర్పాటు చేయడానికి చాలామంది ఆసక్తిగా ఉన్నారు. ప్రభుత్వాన్ని భూములు కూడా కోరుతున్నారు. తాజాగా జరిగిన సదస్సులో నవతరం సినీ స్టూడియోస్ సంస్థ స్టూడియో ఏర్పాటుకు ఎంఓయూ చేసింది. రూ.100 కోట్ల పెట్టుబడితో ఐదు వేల మందికి ఉపాధి కల్పిస్తామని పేర్కొంది. ఎక్కడ అనేది ఇంకా స్పష్టత రాలేదు. భూమి కేటాయింపులపై చర్చలు జరుగుతున్నట్టు సమాచారం.

కల్చరల్ కారవాన్ ఇండియా అనే సంస్థ కూడా స్టూడియో ఏర్పాటుకు ఒప్పందం చేసింది. భూమి కేటాయిస్తే రూ.60 కోట్ల పెట్టుబడితో 25 మందికి ఉపాధి కల్పిస్తామని పేర్కొంది.

సాగర్‌నగర్‌లో పర్యాటక శాఖ భవనంలో సన్ ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ మేనేజ్‌మెంట్ నడుపుతున్న జాస్తి శ్రీకాంత్ స్టార్ హోటల్ ఏర్పాటు చేయడానికి ఎంఓయూ చేశారు. రూ.150 కోట్ల పెట్టుబడితో 2,500 మందికి ఉద్యోగాలు ఇస్తామని పేర్కొన్నారు.

పెట్టుబడుల హబ్‌గా ఏపీ

- 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'తో క్యూ కడుతున్న పారిశ్రామికవేత్తలు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు

అనకాపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని పెట్టుబడుల హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగానే సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో ఇటీవల విశాఖలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు విజయవంతమైందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అన్నారు. సోమవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా రాష్ట్రంలో రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు సమానంగా పెట్టుబడులు వచ్చేలా మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా కంపెనీలకు మార్గదర్శకం చేశారని కొనియాడారు. ఇతర రాష్ట్రాల్లో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ను అనుసరిస్తుంటే ఏపీలో కూటమి ప్రభుత్వం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ను అనుసరిస్తుండడంతో రాష్ట్రానికి పరిశ్రమలు క్యూ కడుతున్నాయని తెలిపారు. మొత్తం 613 ఒప్పందాల ద్వారా రూ.13,25,716 కోట్లు పెట్టుబడులు, 16,13,188 మంది ఉద్యోగాలు రానుండడం గొప్ప విషయమన్నారు. గత ప్రభుత్వంలో జగన్‌రెడ్డి విధ్వంసకర విధానాలకు భయపడి రాష్ట్రాన్ని విడిచి వెళ్లిపోయిన రెన్యూ, హీరో ఫ్యూచర్స్, ఏబీసీ వంటి కంపెనీలు కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత తిరిగి వచ్చాయని పేర్కొన్నారు. సమావేశంలో డీసీఎంఎస్ పర్సన్‌ఇన్‌చార్జి కోట్ని బాలాజీ ఉన్నారు.

ఏపీఎన్జీజీవోల జిల్లా అడహాక్ కమిటీ చైర్మన్‌గా సూర్యనారాయణ


పీలా సూర్యనారాయణ

అనకాపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏపీఎన్జీజీవోల జిల్లా అడహాక్ కమిటీ చైర్మన్‌గా ఏపీ సిటీ ఎంప్లాయీస్ ఉమ్మడి విశాఖపట్నం జిల్లాల అధ్యక్షుడు పీలా సూర్యనారాయణ(రవి) ఎన్నికయ్యారు. సోమవారం అనకాపల్లిలో జరిగిన రాష్ట్ర కమిటీ ఆత్మీయ సమావేశంలో వెల్లడించారు. అడహాక్ కమిటీ కన్వీనర్‌గా శేషుకుమార్, సభ్యులుగా శ్రీనివాస్, దాలినాయుడు, ఆనంద్, త్రినాథ్, సత్యనారాయణ నియమితులయ్యారు.

ఈపీడీసీఎల్ పరిధిలో 100 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు

- విశాఖపట్నం జిల్లాలో 3,715, అనకాపల్లి జిల్లాలో 2,841, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 15...
- గ్రిడ్‌కు అనుసంధానం... సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) పరిధిలో 100 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటుచేసినట్టు సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం కింద ఇప్పటివరకూ 31,022 రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లను పెట్టామన్నారు. వాటి ద్వారా 1,00,026 కిలోవాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతోందన్నారు. ఏలూరు జిల్లాలో అత్యధికంగా 13,491 కిలోవాట్లు, కాకినాడ జిల్లాలో 3,960, విశాఖపట్నం జిల్లాలో 3,715, తూర్పు గోదావరి జిల్లాలో 3,532, పశ్చిమ గోదావరి జిల్లాలో 3,382, శ్రీకాకుళంలో 3,366, విజయనగరంలో 3,279, అనకాపల్లి జిల్లాలో 2,841, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1,934, పార్వతీపురం మన్యంలో 864, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 15 సోలార్ రూఫ్‌టాప్‌లు అమర్చామన్నారు. వీటన్నింటినీ గ్రిడ్‌కు అనుసంధానం చేశామన్నారు. అపార్టుమెంట్లలో వ్యక్తిగత సోలార్ ప్లాంట్లకు అవకాశం లేనందున, కామన్ సర్వీస్‌కు ఉన్న కాంట్రాక్ట్ లోడ్‌కు అనుగుణంగా సోలార్ రూఫ్ టాప్ పెట్టుకోవచ్చునన్నారు. 500 కిలోవాట్ల వరకు కిలోవాట్‌కు రూ.18 వేలు చొప్పున రాయితీ లభిస్తుందన్నారు. అతి తక్కువ వడ్డీకి బ్యాంకు రుణాలు, ఈఎంఐలు ఇస్తాయన్నారు. వినియోగదారులు పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకొని, అందులో ఎంప్యానల్ అయిన వెండర్స్ నుంచి సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తుకు, నెట్ మీటర్‌కు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. స్మార్ట్ మీటరు పెట్టుకున్న వారికి నెట్ మీటర్ అవసరం లేదని స్పష్టంచేశారు. ఇంకేమైనా సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చునన్నారు.


ఆకాశధార వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు


ఉమాధర్మలింగేశ్వరస్వామికి హారతి ఇస్తున్న అర్చకులు

పంచదార్ల క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

- కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు

రాంబిల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం పంచదార్ల భక్తుల శివనామ స్మరణలతో హోరెత్తింది. తెల్లవారుజాము నుంచే భక్తులు పంచదార్ల పుణ్యక్షేత్రానికి రావడం మొదలైంది. తొలుత రాధామాధవస్వామి ఆలయ గర్భంలో ప్రవహిస్తున్న ఆకాశధార వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం పజీగిరిపై కొలువుదీరిన ఉమాధర్మలింగేశ్వరస్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఇంకా రాధామాధవస్వామి, సహస్రలింగేశ్వరస్వామి, ద్విముఖ వినాయకస్వామిలను కూడా దర్శించుకున్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు


అర్జీదారుని సమస్యను ఆలకిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్


అర్జీదారునితో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

- కలెక్టర్ విజయకృష్ణన్
- పీజీఆర్ఎస్‌లో 268 వినతులు

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం జేసీ జాహ్నవి, డీఆర్‌వో వై.సత్యనారాయణలతో కలిసి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు అందజేసిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, ఈ క్రమంలో అర్జీదారులతో నేరుగా మాట్లాడాలని సూచించారు. మొత్తం 268 అర్జీలు అందగా, వాటిని పరిష్కారం నిమిత్తం ఆయా శాఖలకు పంపించామన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో

అనకాపల్లి రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో పౌరులు అందజేసిన అర్జీల పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయం సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో వివిధ సమస్యలపై 55 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, అన్ని ఫిర్యాదులకు సకాలంలో పరిష్కారం చూపుతామన్నారు. ప్రజలు జిల్లా పోలీసు కార్యాలయానికి రానవసరం లేదని, ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఇక్కడ అందిన అర్జీలపై ఏడు రోజుల్లో విచారణ పూర్తి చేసి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్ఐ వెంకన్నపాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలపై నిరంతర పర్యవేక్షణ

- జిల్లా అకడమిక్ ఫోరం సమావేశంలో డీఈవో అప్పారావునాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

కశింకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని జిల్లా విద్యా శాఖాధికారి అప్పారావునాయుడు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన జిల్లా అకడమిక్ ఫోరం మొదటి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో వున్న పాఠశాలలను సందర్శించి విద్యా ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయో పరిశీలించాలన్నారు. మూల్యాంకన పుస్తకాలను ఏ విధంగా దిద్దుతున్నారో తనిఖీ చేసి ఉపాధ్యాయుల పనితీరును మదింపు చేయాలని సూచించారు. సమగ్ర ప్రగతిపత్రం సక్రమంగా నింపుతున్నారో లేదో చూడాలని, బోధనలో ఎదుర్కొంటున్న సమస్యలను ఉపాధ్యాయులు ఏ విధంగా అధిగమించాలో సూచనలు చేయాలన్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష ఏపీడీ జయప్రకాశ్, ఉప విద్యాశాఖాధికారి అప్పారావు, ప్రభుత్వ పరీక్షల సహాయకులు శ్రీధర్‌రెడ్డి, డీసీఈబీ కార్యదర్శి సత్యనారాయణ, ఏపీవో వెంకటేశ్వరరావు, డైట్ లెక్చరర్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

త్రిశంకుస్వర్గంలో సీతపాలెం!

... 5వ పేజీ తరువాయి

గ్రామాన్ని ఖాళీ చేసేది లేదని సీతపాలెం నిర్వాసితులు స్పష్టం చేస్తున్నారు. దిబ్బపాలెం లేదా పంచదార్లలో పునరావాస కాలనీ ఏర్పాటు చేయాలని, ప్రతి కుటుంబానికి ఐదు సెంట్ల స్థలం ఇవ్వాలని, అందరికీ ఒకేచోట ఇళ్లు నిర్మించాలని, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.25 లక్షల చొప్పున సాయం అందించాలని, ఎస్ఈజడ్‌లో ఏర్పాటయ్యే పరిశ్రమల్లో ఉపాధి కల్పించాలని కోరుతున్నారు. అంతవరకు గ్రామాన్ని ఖాళీ చేసేది లేదని స్పష్టం చేస్తున్నారు.

గ్రామాన్ని తరలించకుండా పరిశ్రమల ఏర్పాటు సరికాదు

- లాలం గణేశ్, ఆర్.నారాయణమ్మ

ప్రత్యేక ఆర్థిక మండలి కోసం సుమారు రెండు దశాబ్దాల క్రితం మా భూములను తీసుకున్నారు. ఇంతవరకు పునరావాసం కల్పించలేదు. గ్రామాన్ని తరలించకుండా.. మా భూముల్లో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన మూడు పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో గ్రామంలో ఉండలేకపోతున్నాం. చాలా మంది దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారు. గ్రామాన్ని తరలించకుండా పరిశ్రమలను ఏర్పాటు చేయడం సరికాదు. అధికారులు గతంలో ఇచ్చిన హామీ మేరకు మేము కోరుకున్న చోట పునరావాల కాలనీ ఏర్పాటు చేయాలి.

క్రైం... crime news

ఆటోను ఢీకొన్న కారు

- ముగ్గురికి తీవ్ర గాయాలు

మాకవరపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. సోమవారం ఉదయం నర్సీపట్నం నుంచి మాకవరపాలెం వైపు ఆటో వెళుతోంది. వెనుక నుంచి స్పీడ్‌గా వస్తున్న కారు కొండలఅగ్రహారం వద్ద ఆటోను తప్పించబోయి ఢీకొంది. దీంతో ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న పట్నాల శ్రీనివాసరావుకు రెండు కాళ్లు విరిగిపోయాయి. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీనివాసరావును విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బంగ్లాదేశ్ చొరబాటుదారుని అరెస్టు

కొత్తూరు (అనకాపల్లి జిల్లా), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి పాస్‌పోర్టు, వీసా లేకుండా భారతదేశంలోకి చొరబడిన బంగ్లాదేశ్ వాసిని అరెస్టు చేసినట్టు అనకాపల్లి పట్టణ సీఐ జి.ప్రేమ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి రైల్వే స్టేషన్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని (ఒక పురుషుడు, బాలిక)ను ఇంటెలిజెన్స్ వర్గాలు గుర్తించి పట్టణ ఎస్ఐ సంతోష్‌కుమార్‌కు సమాచారం అందించాయన్నారు. దీంతో సిబ్బందితో వెళ్లి వారిని అదుపులోకి తీసుకొని విచారించగా, బంగ్లాదేశ్‌కు చెందిన విక్రమ్ అలీ అలియాస్ మహ్మద్‌గా తేలిందన్నారు. అతను 2012లో సరిహద్దు దాటి ఇండియాలోకి చొరబడి ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌కు చేరుకొని అక్కడ పదేళ్లు నివాసం ఉన్నాడన్నారు. ఆ తరువాత కాకినాడ ప్రాంతానికి చేరుకున్నాడన్నారు. కాగా రెండు నెలల క్రితం బంగ్లాదేశ్ నివాసి అయిన బాలికను పెళ్లి చేస్తానని నమ్మించి బోర్డర్ దాటించాడన్నారు. విక్రమ్ అలీని న్యాయస్థానం ఆదేశాల మేరకు 14 రోజుల రిమాండ్ నిమిత్తం విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించామని సీఐ తెలియజేశారు. బాలికను సంరక్షణ నిమిత్తం హోమ్‌కు పంపామన్నారు.

అన్నదాత సుఖీభవ రేపు

... 5వ పేజీ తరువాయి

నిధి కింద రూ.రెండు వేలు జమ చేస్తుంది. అంటే ప్రతి రైతుకు రూ.ఏడు వేలు అందనున్నాయి. గత ఆగస్టులో తొలి విడతగా రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.7 వేల వంతున జమ అయ్యాయి. జిల్లాలో ఈ రెండు పథకాల ద్వారా 2,42,536 మంది రైతులకు రూ.161.45 కోట్లు అందనున్నాయి. జిల్లా వ్యవసాయాధికారులు అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధిదారుల జాబితాను రూపొందించి ఇప్పటికే ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు.

బెన్నవోలులో తెల్లసుద్ద మైనింగ్

... 5వ పేజీ తరువాయి

ప్రజాభిప్రాయ సేకరణలో తవ్వకాలకు అనుకూలంగా కొందరు, వ్యతిరేకంగా మరికొందరు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వైట్ క్లే తవ్వకాల వల్ల కాలుష్య సమస్యలు ఉత్పన్నం అవుతాయని, పరిసరాల్లోని వ్యవసాయ భూములు నిర్జీవంగా మారతాయని అన్నారు. ఇక్కడ వైట్ క్లే తవ్వకాలు జరపవద్దని స్పష్టం చేశారు. స్థానికుల అభిప్రాయాలను పక్కనపెడితే ఇక్కడ వచ్చే ఏడాది నుంచే వైట్ క్లే తవ్వకాలు ప్రారంభం కావడం తథ్యమని అధికారవర్గాల సమాచారం.

కొండను నమ్ముకుని దశాబ్దాలుగా ఉపాధి

బెన్నవోలు కొండపై లభించే తెల్లసుద్దను తవ్వుకుని అమ్ముకోవడం ద్వారా స్థానికంగా 12 కుటుంబాలు వారు జీవనోపాధి పొందుతున్నారు. తెల్లసుద్దను పిండి చేసి, ముగ్గుపిండిగా అమ్ముతుంటారు. ఇక్కడ మైనింగ్‌కు ప్రభుత్వం అనుమతులు ఇస్తే తాము ఉపాధి కోల్పోతామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా లీజు తీసుకోనున్న సంస్థ... ఇక్కడ ఉన్న కుటుంబాలు సుద్ద తవ్వుకునేందుకు అనుమతి ఇస్తామని చెబుతుండగా.. కొండ మొత్తం తవ్వుకుపోతే భవిష్యత్తులో తమకు ఏమీ మిగలదని అంటున్నారు.

ఈపీడీసీఎల్‌లో అడ్డగోలు బదిలీలు

... 5వ పేజీ తరువాయి

సర్కిల్‌లో అందుకు విరుద్ధంగా జరుగుతోంది. ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా, ఏ అధికారి లేఖలు రాయకున్నా...కొందరిని ఉన్నతాధికారులు బదిలీ చేస్తున్నారు. పోనీ అక్కడ సమస్య పరిష్కారం కోసమా?...అంటే ఆ కారణాలూ కనిపించడం లేదు. ఎవరి లబ్ధి కోసమో బదిలీలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తాజాగా అంటే రెండు రోజుల కిందట నలుగురు జూనియర్ ఇంజనీర్లను బదిలీలు చేశారు. పరవాడ ఫార్మాసిటీలో పనిచేస్తున్న ఎస్.బంగారయ్యను రోలుగుంటకు వేశారు. రోలుగుంటలో ఉన్న ఓ.రమేశ్‌ను నక్కపల్లికి పంపించారు. అక్కడ ఉన్న ఎం.రామచంద్రను అచ్యుతాపురం వేశారు. అక్కడ పనిచేస్తున్న డి.జె.ప్రసాదరావును పరవాడ ఫార్మాసిటీకి బదిలీ చేశారు. పరిపాలన, ఆపరేషన్ సౌలభ్యం కోసం ఈ బదిలీలు చేశామని ఉత్తర్వుల్లో ఎస్ఈ పేర్కొన్నారు. అయితే ఆయా ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉన్నతాధికారులు ఎవరూ వీరి బదిలీల కోసం సిఫారసు చేయలేదు. లేఖలూ రాయలేదు.

ఆ విషయం కార్పొరేట్ కార్యాలయానికే తెలియదు

అనకాపల్లి సర్కిల్‌లో జరుగుతున్న బదిలీల విషయం పక్కనే విశాఖలో ఉన్న కార్పొరేట్ కార్యాలయానికి కూడా తెలియడం లేదు. ఆ సమాచారం ఇవ్వడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఏళ్లుగా పనిచేస్తున్న ముగ్గురు మహిళలు పి.విజయప్రభ, వి.విజయలక్ష్మి, విష్ణుప్రియలను జిల్లా ఉన్నతాధికారి 40 రోజుల క్రితం బదిలీ చేశారు. ఈ విషయం తెలియక ఇటీవల సీఐఐ పెట్టుబడిదారుల సదస్సుకు డ్యూటీలు వేసినప్పుడు ఆయా మహిళా అధికారులు పూర్వపు స్థానాల్లోనే ఉన్నారనుకొని ఆ విధంగానే ఉత్తర్వులు జారీ చేశారు. ఇది చూసి సర్కిల్ అధికారులు అంతా ఆశ్చర్యపోయారు. ఏ విషయం కార్పొరేట్ కార్యాలయానికి చెప్పడం లేదనే విషయం బయటపడింది.

పనితీరులో అట్టడుగున...

అనకాపల్లి జిల్లాకు ఇటీవల అధిక ప్రాధాన్యం ఏర్పడింది. పెద్ద పెద్ద పరిశ్రమలన్నీ వస్తున్నాయి. అయితే వినియోగదారుల నుంచి ప్రతి నెలా తీసుకునే ఫీడ్ బ్యాక్ ప్రకారం చూసుకుంటే ఈ జిల్లా అట్టడుగున ఉంటోంది. విద్యుత్ సరఫరా సరిగ్గా ఉండడం లేదని, ఫిర్యాదులు చేస్తే సకాలంలో స్పందించడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. గత ఐదు నెలల నుంచీ ఈ జిల్లా అట్టడుగున ఉందని ఓ అధికారి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ముఖ్యంగా మాడుగుల, రావికమతం మండలాల నుంచి అధిక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఆకస్మిక బదిలీలపై అనకాపల్లి ఎస్ఈ జి.ప్రసాద్‌ను వివరణ కోరగా, పరిపాలన అవసరాల కోసమే చేపడుతున్నామన్నారు. కార్పొరేట్ కార్యాలయానికి కూడా సమాచారం ఇస్తామని పేర్కొన్నారు.

ఖాళీ జాగా.. వేసెయ్ పాగా!

... 5వ పేజీ తరువాయి

కంపెనీ వెలసింది. అండర్ బ్రిడ్జి పక్కన కనీసం పది మీటర్ల స్థలం వదలాలి. కానీ ప్లైఉడ్ తయారీ కంపెనీ నిర్వాహకులు వంతెనను ఆనుకొని షెడ్డు నిర్మించారు. ఈ ఆక్రమణలపై గతంలో ఫిర్యాదులు అందడంతో అధికారులు ఆయా ఆక్రమణదారులకు నోటీసులు జారీచేసి చేతులు దులుపుకుంటున్నారు. అనకాపల్లి నుంచి గాజువాక వైపు వెళ్లే రహదారిలో కొప్పాక, సిరసపల్లి, కొత్తూరు, మారేడుపూడి, సాలాపువానిపాలెం, లంకెలపాలెం వరకు జాతీయ రహదారి వెంబడి ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. అటు ఏఎంఏఎల్ కాలేజీ జంక్షన్ పాయకరావుపేట వెళ్లే జాతీయ రహదారి వెంబడి కశింకోట, తాళ్లపాలెం, నక్కపల్లి ప్రాంతాల్లో ఖాళీ జాగాలు ఆక్రమణకు గురవుతున్నాయి. రెవెన్యూ, పోలీసు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించి, రోడ్ల పక్కన ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	107.00
లైవ్ ధర	127.00
విత్ స్కిన్	224.00
స్కిన్ లెస్	234.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614